సాక్షి
అనంతపురం
గురువారం । 8 । ఫిబ్రవరి । 2024



అప్రమత్తంగా ఉండాలి

సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో పోలీసు అధికారులు అప్రమత్తంగా ఉండాలని ఎస్పీ అన్బురాజన్ ఆదేశించారు. 8లో



టమాట కిలో రూ.17

కక్కలపల్లి మండీలో బుధవారం కిలో టమాట గరిష్ట ధర రూ.17 పలికింది. కనిష్టం రూ.6, సరాసరి రూ.14 ప్రకారం క్రయ విక్రయాలు జరిగాయి.

గరిష్టం/కనిష్టం
36.6°/14.8°

జిల్లా అంతటా బుధవారం ఉష్ణోగ్రతలు స్థిరంగా నమోదయ్యాయి. ఉదయం చలి కొనసాగింది. ఆగ్నేయం దిశగా గాలులు గంటకు 6 నుంచి 8 కిలోమీటర్ల వేగంతో వీచాయి.

న్యూస్‌రీల్

మద్దతు ధరతో జొన్నల కొనుగోలు



జొన్నల కొనుగోలును ప్రారంభిస్తున్న పౌరసరఫరాల సంస్థ అధికారులు

పెద్దవడుగూరు: రైతుల నుంచి మద్దతు ధరతో జొన్నలు కొనుగోలు చేస్తున్నట్లు పౌరసరఫరాల సంస్థ జిల్లా మేనేజర్ రవీంద్ర తెలిపారు. బుధవారం మండల పరిధిలోని లక్ష్మంపల్లిలో జొన్నల కొనుగోలును ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పంట ఉత్పత్తులను దళారులకు విక్రయించి నష్టపోరాదని రైతులకు సూచించారు. ప్రభుత్వం క్వింటా జొన్నలు రూ. 3,225, కందులు క్వింటా రూ. 9,370 మద్దతు ధరతో కొనుగోలు చేస్తుందని చెప్పారు. పత్తి రైతులు ఆర్బీకేల్లో పేర్లు నమోదు చేయించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో గుత్తి ఏడీఏ వెంకట్రాముడు, ఏఓ మల్లీశ్వరి, ఏఈఓ రజిని, రైతులు పాల్గొన్నారు.

మున్సిపల్ కమిషనర్ ప్రభాకర్‌రావు హఠాన్మరణం



ప్రభాకర్‌రావు(ఫైల్)

కదిరి టౌన్: మడకశిర మున్సిపల్ కమిషనర్‌గా పనిచేసిన ఎంఎస్ ప్రభాకర్ రావు (60) హఠాన్మరణం చెందారు. బుధవారం గుండెపోటుతో కదిరి ఆర్టీసీ బస్టాండులో కుప్పకూలి ప్రాణం వదిలారు. ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు ఉన్నతాధికారులు ఆయన్ను బుధవారమే పుట్టపర్తి అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ (పుడా) కార్యదర్శిగా బదిలీ చేశారు. అయితే బుధవారం కోర్టు పనిమీద మడకశిర నుంచి రాయచోటికి వెళుతూ కదిరి బస్టాండ్‌లో దిగారు. ఉన్నఫలంగా ఛాతిలో నొప్పి రావడంతో అక్కడే కుప్పకూలారు. స్థానికులు వెంటనే ఆయన్ను కదిరి ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకువెళ్లగా.. పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు. ప్రభాకర్‌రావు స్వస్థలం హిందూపురం. ఆయనకు భార్య, కూతురు ఉన్నారు. ఈ మేరకు కదిరి పట్టణ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

తాగునీటి సమస్య తలెత్తరాదు



సత్యసాయి తాగునీటి ప్రాజెక్టును పరిశీలిస్తున్న నిదియాదేవి

కూడేరు: వేసవిలో ఏ ఒక్క గ్రామంలోనూ తాగునీటి సమస్య తలెత్తకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని సంబంధిత అధికారులను జెడ్పీ సీఈఓ నిదియా దేవి ఆదేశించారు. బుధవారం ఆమె కూడేరు మండలం పీఏబీఆర్ డ్యాం వద్ద ఏర్పాటు చేసిన సీపీడబ్ల్యూఎస్, సత్యసాయి తాగునీటి పథకాలను పరిశీలించారు. సత్యసాయి ప్రాజెక్ట్, సీపీడబ్ల్యూఎస్ ద్వారా ఎన్ని గ్రామాలకు తాగునీరు సరఫరా అవుతోందని డీఈ రామారావును అడిగి తెలుసుకున్నారు. ఏఏ గ్రామాల్లో నీటి సమస్య ఉందో ముందుగానే గుర్తించి సమస్య పరిష్కారానికి చొరవ తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో సత్యసాయి ప్రాజెక్ట్ డీఈ రామారావు, ఆర్‌డబ్ల్యూఎస్ జేఈ ఫాతిమా పాల్గొన్నారు.

18న సిద్ధం

- హాజరు కానున్న సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి
- కేడర్‌కు దిశానిర్దేశం చేయనున్న ముఖ్యమంత్రి
- సభా స్థలి వద్ద శరవేగంగా ఏర్పాట్లు
- రాయలసీమ జిల్లాల నుంచి తరలిరానున్న పార్టీ శ్రేణులు
- చిన్న ఇబ్బంది కూడా తలెత్తకుండా కట్టుదిట్టమైన ఏర్పాట్లు
- పరిశీలించిన జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి పెద్దిరెడ్డి, తలశిల రఘురాం, ప్రజాప్రతినిధులు



సభా వేదికను పరిశీలిస్తున్న జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, సీఎం ప్రోగ్రామ్స్ కో-ఆర్డినేటర్ తలశిల రఘురాం, ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్ రెడ్డి తదితరులు

రాప్తాడు: ఎన్నికల కదనరంగంలో వైఎస్సార్ సీపీ దూసుకుపోతోంది. శ్రేణులను మహా సంగ్రామానికి 'సిద్ధం' చేస్తోంది. ఇప్పటికే సీఎం వైఎస్ జగన్ మోహన్ రెడ్డి సమరశంఖం పూరించారు. ఈ క్రమంలోనే రాయలసీమ వ్యాప్తంగా పార్టీ నాయకులు, కార్యకర్తలను ఎన్నికలకు సమాయత్తం చేసేందుకు ముఖ్యమంత్రి ఈ నెల 18న రాప్తాడు రానున్నారు. స్థానిక ఆటోనగర్ వద్ద నిర్వహించే 'సిద్ధం' బహిరంగ సభలో పార్టీ శ్రేణులను ఉద్దేశించి ప్రసంగించనున్నారు.

50 నియోజకవర్గాల నుంచి..

ఇప్పటికే నిర్వహించిన సిద్ధం సభలకు కనీవినీ ఎరుగని రీతిలో లక్షలాది మంది తరలివచ్చారు. దీన్ని దృష్టిలో ఉంచుకుని రాప్తాడు 'సిద్ధం' సభకు పకడ్బందీగా ఏర్పాట్లు చేస్తున్నారు. తరలివచ్చే శ్రేణులకు ఎక్కడా చిన్న ఇబ్బంది కలగకుండా చర్యలు తీసుకుంటున్నారు. రాయలసీమలోని 50 నియోజకవర్గాల నుంచి మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, ముఖ్య నేతలతో పాటు లక్షల సంఖ్యలో పార్టీ శ్రేణులు సిద్ధం సభకు హాజరు కానుండడంతో ఆ మేరకు ఏర్పాట్లు చేస్తున్నారు. ఇప్పటి వరకూ 19కి పైగా పార్కింగ్ ప్రాంతాలు గుర్తించారు. సభావేదిక వెనుక భాగంలో సీఎం హెలీప్యాడ్ పనులు చేపడుతున్నారు. సభావేదిక ముందు భాగంలో సీఎం వైఎస్ జగన్ కార్యకర్తలకు దగ్గరగా వెళ్లి అభివాదం చేయడానికి వీలుగా సుమారు కిలో మీటరు విస్తీర్ణంతో ప్రత్యేక ర్యాంపులు ఏర్పాటు చేస్తున్నారు.

ఏర్పాట్లు పరిశీలించిన జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి

'సిద్ధం' బహిరంగ సభ ఏర్పాట్లను జిల్లా ఇన్‌ఛార్జ్ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, సీఎం ప్రోగ్రామ్స్ కో-ఆర్డినేటర్, ఎమ్మెల్సీ తలశిల రఘురాం బుధవారం పరిశీలించారు. సభా వేదిక వద్ద తీసుకోవాల్సిన జాగ్రత్తలను అధికారులకు వివరించారు. అనంతపురం ఏఆర్, రూరల్ డీఎస్పీలు మునిరాజు, వెంకట శివారెడ్డితో మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రా రెడ్డి సమీక్షించారు. వాహనాల రాకపోకలు, పార్కింగ్, వీఐపీ పార్కింగ్, భద్రతా ఏర్పాట్లు, సీఎం సభాస్థలి, హెలీ ప్యాడ్, ట్రాఫిక్ తదితర అంశాలపై సమీక్షించారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్ రెడ్డి, వైఎస్సార్ సీపీ హిందూపురం పార్లమెంటు సమన్వయకర్త శాంతమ్మ, ప్రభుత్వ సలహాదారు ఆలూరి సాంబశివా రెడ్డి, పార్టీ జిల్లా అధ్యక్షుడు పైలా నరసింహయ్య, రాయదుర్గం, మడకశిర సమన్వయకర్తలు మెట్టు గోవిందరెడ్డి, ఈర లక్కప్ప, అనంతపురం, చిత్తూరు జిల్లా పరిషత్ చైర్‌పర్సన్లు బోయ గిరిజమ్మ, శ్రీనివాసులు, అహుడా చైర్మన్ మహాలక్ష్మీ శ్రీనివాస్, ఉర్దూ అకాడమీ చైర్మన్ నదీమ్ అహమ్మద్, ఏడీసీసీ బ్యాంకు చైర్‌పర్సన్ లిఖిత, ఆర్టీసీ జోనల్ చైర్‌పర్సన్ మాల్యవంతం మంజుల, మేయర్ వసీం, డిప్యూటీ మేయర్ కోగటం విజయభాస్కర్ రెడ్డి, వైస్ ఎంపీపీ బోయ రామాంజినేయులు, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ జూటూరు శేఖర్, నాయకులు చిర్రెడ్డి సత్యనారాయణ రెడ్డి, బీసీ సెల్ నాయకులు చిట్రా వెంకటేష్, పసుపుల ఆది, తదితరులు పాల్గొన్నారు.





సభా స్థలి ఏర్పాట్లలో నిమగ్నమైన కార్మికులు, పార్టీ శ్రేణులకు ఇబ్బందులు కలగకుండా ప్రాంగణాన్ని చదును చేస్తున్న దృశ్యం, పార్టీ శ్రేణులకు అభివాదం చేస్తూ సీఎం నడిచి వచ్చేందుకు ఏర్పాటు చేస్తున్న ర్యాంప్

పేదలకు ఆరోగ్య భరోసా కల్పించడం భేష్

- కేంద్ర కుటుంబ సంక్షేమ శాఖ రీజినల్ డైరెక్టర్ డాక్టర్ అనూరాధ



వైద్య సిబ్బందితో మాట్లాడుతున్న డాక్టర్ అనూరాధ

రాయదుర్గంటౌన్: దేశంలోనే ఎక్కడా లేని విధంగా పేదల కోసం ప్రత్యేకంగా వైద్య శిబిరాలు ఏర్పాటు చేసి ఆరోగ్య భరోసా కల్పించడం అభినందనీయమని కేంద్ర కుటుంబ సంక్షేమ శాఖ రీజినల్ డైరెక్టర్ డాక్టర్ అనూరాధ పేర్కొన్నారు. స్థానిక భంభంస్వామి లేఅవుట్‌లోని వైఎస్సార్ అర్బన్ హెల్త్ సెంటర్‌ను బుధవారం ఆమె తనిఖీ చేశారు. 'జగనన్న ఆరోగ్య సురక్ష' వైద్య శిబిరాన్ని పరిశీలించారు. అక్కడున్న పలువురితో సేవలపై ఆరా తీశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రాష్ట్రంలో అమలవుతున్న ఆరోగ్య కార్యక్రమాలు పేదలకు ఎంతో మేలు చేస్తున్నాయన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న పథకాలను పేదల దరిజేర్చాలని వైద్య సిబ్బందికి సూచించారు. బాలింతలు, గర్భిణులకు మెరుగైన సేవలందించాలని ఆదేశించారు. కార్యక్రమంలో వైద్యుడు అజహర్‌ఖాన్, యూపీహెచ్‌సీ కోఆర్డినేటర్ డాక్టర్ సందేశ్‌కుమార్, కౌన్సిలర్లు గౌని లావణ్య, శ్రీలక్ష్మీ, వార్డు ఇన్‌చార్జ్‌లు పొరాళ్ల శివకుమార్, గౌని శ్రీరామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నాణ్యమైన వైద్యం అందించాలి

కళ్యాణదుర్గం: పేదలకు నాణ్యమైన వైద్యం అందించాలని కేంద్ర కుటుంబ సంక్షేమ శాఖ రీజినల్ డైరెక్టర్ డాక్టర్ అనూరాధ సూచించారు. బుధవారం ఆమె కళ్యాణదుర్గం ప్రభుత్వాసుపత్రి, ఆర్డీటీ ఆసుపత్రులను తనిఖీ చేశారు. వైద్య సేవలపై రోగులను అడిగి తెలుసుకున్నారు. ఓపీ, మందుల పంపిణీ, గర్భిణులు, బాలింతలకు అందుతున్న సేవలను పరిశీలించారు. అనంతరం వైద్య సిబ్బందితో మాట్లాడుతూ రోగికి సాంత్వన చేకూర్చినప్పుడే వైద్య వృత్తికి సార్థకత లభిస్తుందని చెప్పారు. మాతా, శిశు మరణాలను తగ్గించాలన్నారు. కార్యక్రమంలో డాక్టర్లు మాధవి, పవన్, సాయి చరణ్, అర్షాద్, శ్వేతలతో పాటు సిబ్బంది పాల్గొన్నారు.

పశువుల కంటైనర్ బోల్తా

- ఇద్దరు వ్యక్తుల దుర్మరణం
- 26 ఎద్దులు, 9 ఆవుల మృతి
- పెద్దవడుగూరు మండలంలో ఘోరం




మృతులు శ్రీనివాసరావు, ఈశ్వరరావు(ఫైల్)



అదుపు తప్పి బోల్తా పడిన కంటైనర్



ఘటనా స్థలంలో పశువుల కళేబరాలు

పెద్దవడుగూరు: పశువులను అక్రమంగా తరలిస్తున్న ఓ కంటైనర్ బోల్తా పడింది. ఇద్దరు వ్యక్తులు దుర్మరణం పాలయ్యారు. 26 ఎద్దులు, 9 ఆవులు మృతి చెందాయి. మండల పరిధిలోని కాశేపల్లి టోల్‌గేట్ వద్ద మంగళవారం రాత్రి ఈ ఘటన చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన మేరకు.. హైదరాబాదులో పశువులను కొనుగోలు చేసిన ఓ ముఠా వాటిని రహస్యంగా కంటైనర్‌లో బెంగళూరు తరలిస్తున్నారు. సుమారు 40 పశువులతో వెళ్తున్న కంటెయినర్ మంగళవారం రాత్రి 11 గంటల సమయంలో కాశేపల్లి టోల్‌గేట్ సమీపంలో అదుపుతప్పి సిమెంటు దిమ్మెను ఢీకొంది. రోడ్డు పక్కనే బోల్తా పడింది. ప్రమాదంలో తీవ్రగాయాలైన 26 ఎద్దులు, 9 ఆవులు అక్కడికక్కడే మృతి చెందాయి. మరో 4 ఆవులకు తీవ్రగాయాలయ్యాయి. కంటైనర్ వెనుక భాగంలో జీవాలతో పాటే ఉన్న శ్రీకాకుళం జిల్లా జలమూరు మండలం పంగవానిపేటకు చెందిన శ్రీనివాసరావు (52), విశాఖపట్నం జిల్లా దేవవరానికి చెందిన ఈశ్వరరావు (46) కూడా దుర్మరణం పాలయ్యారు. ఒకేసారి పెద్ద సంఖ్యలో జీవాలు మృతి చెందడంతో ఆ ప్రాంతం భీతావహంగా మారింది.

మిన్నంటిన మూగరోదన..

కంటైనర్ బోల్తా పడడంతో కిందపడిన మూగజీవాలు అంబా అంబా అంటూ పెద్దపెట్టున అరుపులు లంకించుకున్నాయి. దీంతో సమీపంలోని పెట్రోల్ బంకు, టోల్ గేట్ సిబ్బంది ఘటనా స్థలికి చేరుకున్నారు. వెంటనే సమాచారాన్ని పోలీసులకు చేరవేశారు. యాడికి సర్కిల్ సీఐ రోషన్, పెద్దవడుగూరు ఎస్ఐ శ్రీనివాసులు సిబ్బందితో అక్కడికి చేరుకొని సహాయక చర్యలు చేపట్టారు. జేసీబీ సహాయంతో కళేబరాలను తొలగించారు. వాటి కింద ఇరుక్కున్న శ్రీనివాసరావు, ఈశ్వరరావు మృతదేహాలను అతి కష్టం మీద బయటకు తీశారు. పామిడి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. పశువుల కళేబరాలను ఘటనా స్థలికి సమీపంలోనే ఖననం చేశారు. గాయపడిన పశువులు అరుస్తూ ఉండడం చూసిన పలువురు కంటతడి పెట్టారు.

డ్రైవర్ అజాగ్రత్తతోనే..

డ్రైవర్ అజాగ్రత్తే ప్రమాదానికి కారణమని ప్రాథమికంగా గుర్తించినట్లు ఎస్ఐ శ్రీనివాసులు బుధవారం విలేకరులకు తెలిపారు. కంటైనర్ బోల్తా పడగానే డ్రైవర్, క్లీనర్లు పరారైనట్లు ఆయన వెల్లడించారు. ప్రాథమిక విచారణలో మృతులు సాధారణ కూలీలని తెలిసిందని పేర్కొన్నారు. వారి బంధువులకు సమాచారమిచ్చామని వెల్లడించారు. వారు ఇక్కడికి వస్తే మరిన్ని విషయాలు తెలిసే అవకాశముందన్నారు.

డీఎస్సీ అభ్యర్థులకు శుభవార్త

- ఉమ్మడి జిల్లాలో 386 టీచర్ పోస్టులు!

అనంతపురం ఎడ్యుకేషన్: టీచర్ పోస్టుల అభ్యర్థులకు ప్రభుత్వం శుభవార్త వినిపించింది. డీఎస్సీకి షెడ్యూల్ విడుదల చేసింది. బుధవారం విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ షెడ్యూల్ ప్రకటించారు. మార్చి 15 నుంచి 30 వరకు రెండు విడతలగా పరీక్షలు నిర్వహించనున్నారు. ఏప్రిల్ 7న ఫలితాలు వెల్లడిస్తారు. ఈనెల 12 నుంచి దరఖాస్తు ప్రక్రియ ప్రారంభం కానుంది. మార్చి 5 నుంచి హాల్ టికెట్లు డౌన్‌లోడ్ చేసుకోవచ్చు.రాష్ట్రంలో 6,100 పోస్టులు భర్తీ చేయనున్నారు. ఉమ్మడి జిల్లాలో దాదాపు 386 పోస్టులు భర్తీకి చర్యలు తీసుకున్నారు. ఇందులో ఎస్జీటీ పోస్టులు 107, స్కూల్ అసిస్టెంట్ పోస్టులు 164, టీజీటీ పోస్టులు 115 ఉన్నట్లు తెలిసింది. ఒకటి రెండు రోజుల్లో నోటిఫికేషన్ విడుదల కానుందని విద్యాశాఖ అధికారులు తెలిపారు. కాగా టెట్ నోటిఫికేషన్ గురువారం విడుదల కానుంది. పరీక్షలు ఈనెల 27 నుంచి మార్చి 9 వరకు జరగనున్నాయి. హాల్ టికెట్లు ఈనెల 23 నుంచి డౌన్‌లోడ్ చేసుకోవచ్చు.

డీఈఓ కార్యాలయ సిబ్బంది నిర్లక్ష్యం

డీఎస్సీ, టెట్‌కు సంబంధించిన వివరాలు ఎప్పటికప్పుడు తెలియజేస్తూ అభ్యర్థుల సందేహాలు నివృత్తి చేయాల్సిన బాధ్యత జిల్లా విద్యాశాఖ అధికారులపై ఉంది. పలువురు అభ్యర్థులు డీఈఓ కార్యాలయంలోని సంబంధిత విభాగం సిబ్బందిని కలవగా తీవ్ర నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. తమకేమీ తెలియదన్నట్లు మాట్లాడటాన్ని అభ్యర్థులు తప్పుబడుతున్నారు. కలెక్టర్ స్పందించి చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

సకల సౌకర్యాలతో 'టిడ్కో ఇళ్లు'



టిడ్కో ఇళ్లను పరిశీలిస్తున్న చైర్మన్ ప్రసన్నకుమార్

తాడిపత్రిటౌన్: సకల సౌకర్యాలతో కూడిన ఇళ్లను త్వరలో అక్కచెల్లెమ్మలకు అప్పగించనున్నట్లు టిడ్కో రాష్ట్ర చైర్మన్ జమాన ప్రసన్నకుమార్ అన్నారు. బుధవారం ఎమ్మెల్యే తనయుడు కేతిరెడ్డి సాయిప్రతాప్ రెడ్డితో కలిసి పట్టణంలోని టిడ్కో ఇళ్ల నిర్మాణాలను ఆయన పరిశీలించారు. అనంతరం మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా దాదాపు 1,43,600 ఇళ్లు అందజేస్తున్నామన్నారు. తాడిపత్రిలో 1,024 టిడ్కో ఇళ్ల నిర్మాణం చేపట్టామన్నారు. ఫిబ్రవరి రెండో వారంలో మొదటి విడతగా 308 గృహాలను లబ్ధిదారులకు అందజేస్తామన్నారు. గత ఎన్నికల ముందు మహిళలకు ఇచ్చిన మాటను సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నిలబెట్టుకున్నారన్నారు. రిజిస్ట్రేషన్ చేసి రూ. 12 లక్షల ఆస్తిని అక్కచెల్లెమ్మలకు అందజేస్తున్నారన్నారు. గత టీడీపీ ప్రభుత్వం మహిళల నుంచి డబ్బు లాగడమే కాకుండా నిర్మాణాల పేరిట మభ్యపెట్టిందని విమర్శించారు. తాడిపత్రి ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి ప్రత్యేక చొరవ తీసుకొని దాదాపు 3 కిలోమీటర్ల తాగునీటి పైప్‌లైన్ ఏర్పాటు చేస్తుండడం అభినందనీయమన్నారు. ఈ ప్రాంతంలో మరో 6 వేల ఇళ్ల నిర్మాణాలు చేపట్టడం గర్వకారణమన్నారు. టిడ్కో ఇళ్ల సమీపంలో ప్రభుత్వం దాదాపు రూ. 1.50 కోట్లతో మహిళామార్ట్‌ను ఏర్పాటు చేస్తోందని, మార్కెట్ రేటుకంటే దాదాపు 25 శాతం తక్కువకు మార్ట్‌లో సరుకులు లభిస్తాయని చెప్పారు. ఇప్పటికే శ్రీకాకుళం, చిత్తూరు జిల్లాల్లో ఏర్పాటు చేసిన మహిళా మార్ట్‌లు విజయవంతంగా కార్యకలాపాలు సాగిస్తున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎస్ఈ రాజశేఖర్, ఈఈ మల్లికార్జున, డీఈ సాలన్న, వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకులు ఆలూరు రామేశ్వరరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సెక్టోరియల్ అధికారులు బాధ్యతగా పనిచేయాలి




మాట్లాడుతున్న కలెక్టర్ గౌతమి, చిత్రంలో ఎస్పీ అన్బురాజన్, జేసీ కేతన్‌గార్గ్, జెడ్పీ సీఈఓ నిదియా దేవి, కమిషనర్ మేఘస్వరూప్, హాజరైన అధికారులు

అనంతపురం: ఎన్నికల ప్రక్రియలో సెక్టోరియల్ అధికారుల పాత్ర ఎంతో ముఖ్యమైనదని, అధికారులు బాధ్యతతో పనిచేయాలని కలెక్టర్ ఎం.గౌతమి ఆదేశించారు. స్థానిక జేఎన్‌టీయూ(ఏ) ఆడిటోరియంలో బుధవారం శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. కలెక్టర్‌తో పాటు జిల్లా ఎస్పీ కేకేఎన్ అన్బురాజన్ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ గౌతమి మాట్లాడుతూ ఎన్నికల కమిషన్ సూచనలను వంద శాతం పాటించాలన్నారు. ప్రీ పోల్, పోలింగ్ రోజు కార్యక్రమాలను జాగ్రత్తగా చేపట్టాలన్నారు. పోలింగ్ ఏరియా, పోలింగ్ స్టేషన్లను పరిశీలించాలన్నారు. పోలింగ్ స్టేషన్ల వారీగా బీఎల్వోలు ఎవరెవరు ఉన్నారో తెలిసి ఉండాలని, సెక్టోరియల్ అధికారులు, సెక్టోరియల్ పోలీసు అధికారులు బీఎల్వోలతో వాట్సాప్ గ్రూపు ఏర్పాటు చేయాలన్నారు. నియోజకవర్గ స్థాయి డిస్ట్రిబ్యూషన్ కేంద్రం, అనంతపురం జేఎన్‌టీయూలో ఏర్పాటు చేయనున్న రిసెప్షన్ కేంద్రాలు చూసుకోవాలన్నారు. పోలింగ్ కేంద్రాల రూట్స్ పరిశీలించాలన్నారు. 80 ఏళ్ల పైబడిన సీనియర్ సిటిజన్స్, దివ్యాంగుల వివరాలు తెలుసుకోవాలన్నారు. 2014, 2019 ఎన్నికల్లో ఏయే పోలింగ్ స్టేషన్లలో తక్కువగా ఓటింగ్ నమోదయిందన్న దానిపై తనిఖీ చేయాలన్నారు. 18 సంవత్సరాలు నిండి ఓటరుగా నమోదు కాని వారిని ఓటర్లుగా నమోదు చేయించాలన్నారు. సమస్యాత్మక పోలింగ్ స్టేషన్లలో వీడియోగ్రఫీ చేయాలన్నారు. క్షేత్రస్థాయిలో పోలింగ్ కేంద్రాల ప్రధానోపాధ్యాయులు, ప్రిన్సిపాళ్ల ఫోన్ నెంబర్లు తెలుసుకోవాలన్నారు. క్షేత్రస్థాయిలో ఏ ముఖ్యమైన సమాచారం ఉన్న ఆర్వోకి, జిల్లా ఎన్నికల అధికారికి అందించాలన్నారు. వలంటీర్లకు ఎలాంటి పని అప్పగించరాదన్నారు. పోలింగ్ కేంద్రాల్లో ఫర్నీచర్, తాగునీరు, లైట్లు, ఫ్యాన్లు, మరుగుదొడ్లు, ప్రత్యేక క్యూలైన్లు ఇలా అన్ని వసతులు ఏర్పాటు చేయాలన్నారు. పోలింగ్ స్టేషన్‌ని గ్రౌండ్ ఫ్లోర్‌లోనే ఏర్పాటు చేయాలన్నారు. ఏ పోలింగ్ స్టేషన్‌లో ఓటు వేయాలనేది ఓటర్లకు తెలియజేయాలన్నారు. ఆర్వోలు వచ్చే శుక్రవారం సెక్టోరియల్ అధికారులకు ఈవీఎం డెమోన్‌స్ట్రేషన్‌పై శిక్షణ ఇవ్వాలన్నారు. ఎస్పీ కేకేఎన్ అన్బురాజన్ మాట్లాడుతూ అనుమతులు లేకుండా ప్రచారం చేయడం, డబ్బు పంపిణీ లాంటివి అరికట్టాలన్నారు. జాయింట్ కలెక్టర్ కేతన్‌గార్గ్ మాట్లాడుతూ సెక్టోరియల్ అధికారులు ప్రతి పోలింగ్ స్టేషన్‌ని తప్పకుండా తనిఖీ చేయాలన్నారు. అన్ని పోలింగ్ కేంద్రాలకు పేరు, నంబర్ వేయాలన్నారు. అధికారుల మధ్య సమాచార లోపం ఉండకూడదని, అందరితో సమన్వయం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో జెడ్పీ సీఈవో వైఖోమ్ నిదియా దేవి, మున్సిపల్ కమిషనర్ మేఘ స్వరూప్, డీఆర్‌ఓ జి.రామకృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

న్యాయమూర్తుల పర్యటనకు పకడ్బందీ ఏర్పాట్లు

అనంతపురం అర్బన్: సుప్రీం కోర్టు న్యాయమూర్తుల పర్యటనకు పకడ్బందీగా ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ ఎం.గౌతమి ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్ హాలులో అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ శనివారం జేఎన్‌టీయూ ఆడిటోరియంలో బార్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో 'వర్క్ షాప్ ఫర్ యంగ్ అడ్వకేట్స్' కార్యక్రమం జరగనుందన్నారు. సుప్రీం కోర్టు న్యాయమూర్తి జస్టిస్ అశానద్దీన్ అమనుల్లా ముఖ్య అతిథిగా, సుప్రీంకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ ప్రశాంత్‌కుమార్ మిశ్రా, జస్టిస్ ఎస్.వి.ఎన్.భట్టి, బార్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా అడ్వకేట్ మనన్ కుమార్ మిశ్రా అతిథులుగా హాజరవుతారన్నారు. అలాగే ఆరుగురు ఆంధ్రప్రదేశ్ హైకోర్టు న్యాయమూర్తులు ప్రత్యేక అతిథులుగా హాజరవుతారన్నారు. బందోబస్తు, ఎస్కార్ట్, పార్కింగ్, భోజన, వసతి ఏర్పాట్లు, గాడ్ ఆఫ్ హానర్ తదితర ఏర్పాట్లు జాగ్రతగా చేపట్టాలన్నారు.సమావేశంలో జేసీ కేతన్‌గార్గ్, జెడ్పీ సీఈఓ వైఖోమ్ నిదియా దేవి, కమిషనర్ మేఘ స్వరూప్, డీఆర్‌ఓ రామకృష్ణారెడ్డి, బార్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా సభ్యుడు, ట్రస్ట్ ఎగ్జిక్యూటివ్ వైస్ చైర్మన్ ఎ.రామిరెడ్డి, న్యాయవాదులు హరినాథ్‌రెడ్డి, నరసింహులు, తదితరులు పాల్గొన్నారు.

ముగ్గురు కానిస్టేబుళ్ల డిస్మిస్

అనంతపురం: నేరస్తులతో అంటకాగి అక్రమాలకు పాల్పడిన ముగ్గురు పోలీసు కానిస్టేబుళ్ల ఉద్యోగాలు ఊడాయి. ఈ మేరకు బుధవారం ఎస్పీ కేకేఎన్ అన్బురాజన్ ఉత్తర్వులు జారీ చేశారు. 2012లో ప్రకాశం జిల్లాలో పట్టుబడ్డ చోరీ కేసుల్లో నిందితులతో కానిస్టేబుళ్లు ప్రవీణ్ కుమార్, ఫరూక్ బాషా, ఆనంద్‌బాబులు ఆర్థిక లావాదేవీలు జరిపినట్లు ప్రాథమికంగా వెల్లడైంది. దీంతో అప్పట్లోనే వారిని సస్పెండ్ చేసినా, కొన్ని రోజులకే మళ్లీ విధుల్లోకి తీసుకున్నారు. రూరల్ మండలాలకు కేటాయించారు. అయితే, ఈ ముగ్గురిపై డిపార్ట్‌మెంటల్ విచారణ మాత్రం కొనసాగించారు. చోరీ కేసుల్లో నిందితుల నుంచి రూ. లక్షల్లో లబ్ధి పొందినట్లు తాజాగా వెల్లడైంది. ఈ మేరకు విచారణాధికారులు నివేదికను ఎస్పీకి అందజేశారు. దీంతో ముగ్గురినీ ఉద్యోగాల నుంచి డిస్మిస్ చేస్తూ ఎస్పీ ఆదేశాలు జారీ చేశారు.

నేడు 'ఇంటాక్' చైర్మన్ రాక

అనంతపురం కల్చరల్: ఇంటాక్ (అఖిల భారత కళలు, సాంస్కృతిక వారసత్వ సంపద పరిరక్షణ ట్రస్టు) చైర్మన్ ఎల్‌కే గుప్తా గురువారం జిల్లాకు రానున్నట్లు జిల్లా అధ్యక్షుడు రామకుమార్, కవి అశ్వర్థ రెడ్డి తెలిపారు. నగరంలోని రోటరీ క్లబ్‌లో సాయంత్రం నిర్వహించే కార్యక్రమంలో పాల్గొంటారని తెలిపారు. లేపాక్షి ఆలయానికి 'యునెస్కో' గుర్తింపు సాధనకు చేపట్టాల్సిన చర్యలపై చర్చిస్తారని వివరించారు.

క్లుప్తంగా

నేడు జిల్లాలో పర్యటించనున్న ఎస్టీ కమిషన్ సభ్యుడు

అనంతపురం రూరల్: రాష్ట్ర ఎస్టీ కమిషన్ సభ్యుడు వడిత్యా శంకర్‌నాయక్ గురు, శుక్రవారాల్లో జిల్లాలో పర్యటించనున్నారు. ఈ మేరకు జిల్లా గిరిజన సంక్షేమ శాఖ అధికారి రామాంజనేయులు బుధవారం ఓ ప్రకటన విడుదల చేశారు. గురువారం ఉదయం ఆత్మకూరు మండలం సింగంపల్లి తండా, 9వ తేదీన శింగనమల మండలం నాగులగుడ్డం తండాలో ఆయన పర్యటించనున్నారు.

గొర్రెల అపహరణపై కేసు నమోదు

బెళుగుప్ప: మండలంలోని గంగవరం సమీపంలో కొన్ని రోజుల క్రితం 22 గొర్రెలు అపహరించుకెళ్లిన విషయం తెలిసిందే. ఘటనకు సంబంధించి బాధిత కాపరి ఆదినారాయణ ఫిర్యాదు మేరకు బుధవారం పోలీసులు కేసు నమోదు చేశారు. కళ్యాణదుర్గం మండల బాల వెంకటాపురం గ్రామానికి చెందిన ఆదినారాయణ తన గొర్రెలను మేపు కోసం బెళుగుప్ప మండలం గంగవరం గ్రామ సమీపంలో వదిలాడు. ఈ క్రమంలో అక్కడే తాత్కాలిక దొడ్డి ఏర్పాటు చేసుకున్నాడు. గత నెల 10వ తేదీన 22 గొర్రెలను దుండగులు అపహరించుకెళ్లారు. అప్పటి నుంచి చుట్టుపక్కల గ్రామాల్లో కాపరి గాలించినా ఫలితం లేకపోయింది. దీంతో బుధవారం ఫిర్యాదు చేయడంతో పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టినట్లు ఎస్‌ఐ శివ తెలిపారు. అపహరణకు గురైన గొర్రెల విలువ దాదాపు రూ.2లక్షలు ఉంటుందని ఈ సందర్భంగా బాధిత కాపరి వాపోయాడు.

కలుషిత నీరు తాగి 50 గొర్రెల మృతి



మృతి చెందిన గొర్రెలను పరిశీలిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

ఉరవకొండ: కలుషిత నీరు తాగి 50 గొర్రెలు మృత్యువాతపడ్డాయి. ఉరవకొండ మండలం పెద్ద కౌకుంట్ల నుంచి తగ్గుపర్తి వెళ్లే మార్గంలో హంద్రీ–నీవా పిల్ల కాలువ వద్ద ఈ ఘటన చోటు చేసుకుంది. రాకెట్ల తండాకు చెందిన వెంకటేష్‌నాయక్ బుధవారం ఉదయం తన గొర్రెలను మేపునకు తీసుకెళ్లి మధ్యాహ్నం నీటి కోసం హంద్రీ–నీవా పిల్ల కాలువ వద్ద వదిలాడు. నీరు తాగిన కొద్ది సేపటికే ఒకటి తర్వాత ఒకటి చొప్పున 50 గొర్రెలు మృతి చెందాయి. వీటి విలువ దాదాపు రూ.3 లక్షలు ఉంటుందని ఈ సందర్భంగా బాధిత కాపరి వాపోయాడు. విషయం తెలుసుకున్న వైఎస్సార్‌సీపీ నాయకులు రాకెట్ల అశోక్‌కుమార్, నాగరాజు, శీనానాయక్ అక్కడకు చేరుకుని బాధిత కాపరిని పరామర్శించారు.

న్యాక్‌కు సన్నద్ధం



- గత నాలుగున్నరేళ్లలో జేఎన్‌టీయూ(ఏ) విశేషమైన ప్రగతి
- రూ.85 కోట్ల వ్యయంతో నూతన భవనాల నిర్మాణం
- ఈ నెల 22 నుంచి మూడు రోజుల పాటు పర్యటించనున్న న్యాక్ పీర్ కమిటీ

అనంతపురం: సాంకేతిక రంగంలో రాయలసీమకే తలమానికంగా నిలిచిన జేఎన్‌టీయూ (అనంతపురం) న్యాక్ (నేషనల్ అసెస్‌మెంట్ అక్రిడిటేషన్ కౌన్సిల్) గుర్తింపునకు సిద్ధమైంది. వర్సిటీలో గత నాలుగున్నర సంవత్సరాల్లో విశేషమైన ప్రగతిని సాధిచడమే ఇందుకు నిదర్శనం. వర్సిటీ ఏర్పడి 16 సంవత్సరాలు పూర్తయినా ఇప్పటి వరకూ న్యాక్ గ్రేడింగ్‌కు వెళ్లలేదు. తాజాగా న్యాక్ గ్రేడింగ్‌కు దరఖాస్తు చేయడంతో ఈ నెల 22 నుంచి మూడు రోజుల పాటు న్యాక్ పీర్ కమిటీ సభ్యులు వర్సిటీలో పర్యటించనున్నారు. ఇప్పటికే న్యాక్‌కు సంబంధించి వర్సిటీ అధికారులు పూర్తి సన్నద్ధంగా ఉన్నారు. ఈ క్రమంలోనే రూపొందించిన సెల్ఫ్‌స్టడీ నివేదికను న్యాక్‌కు సమర్పించారు. ఈ నివేదిక ఆధారంగా న్యాక్ కమిటీ సభ్యులు అన్ని అంశాలను పరిశీలించి గ్రేడింగ్ ఇవ్వనున్నారు. జేఎన్‌టీయూ(ఏ)కు న్యాక్‌లో మంచి గ్రేడింగ్ వస్తుందనే ఆశాభావంతో వర్సిటీ ఉన్నతాధికారులు ఉన్నారు.

నూతన భవనాల నిర్మాణాలు

జేఎన్‌టీయూ(ఏ)లో నూతన పాలక భవనం, కంప్యూటర్ సైన్సెస్ విభాగం, లెక్చరర్ కాంప్లెక్స్, ఇండోర్ స్టేడియం, స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్‌ను నూతనంగా నిర్మించారు. ఈ ఐదు నిర్మాణాలకు రూ.85 కోట్లు వెచ్చించారు. అధునాతన సౌకర్యాలతో నిర్మించిన పాలక భవనాన్ని ఇటీవల రాష్ట్ర గవర్నర్, జస్టిస్ సయ్యద్ అబ్దుల్ నజీర్ ప్రారంభించారు. అన్ని విభాగాలకు ఎన్‌బీఏ (నేషనల్ బోర్డ్ ఆఫ్ అక్రిడిటేషన్) గుర్తింపు దక్కింది. ఇంజినీరింగ్ విద్యార్థులకు ప్రత్యేకంగా నైపుణ శిక్షణ ఇచ్చేందుకు వీలుగా సెంటర్ ఆఫ్ ఎక్స్‌లెన్స్‌లు ఏర్పాటు చేశారు. పారిశ్రామిక విధానం 4.0 పేరుతో జేఎన్‌టీయూ (ఏ) క్యాంపస్ ఇంజినీరింగ్ కళాశాలలో రూ.1000 కోట్లతో సెంటర్ ఆఫ్ ఎక్సెలెన్స్ ఏర్పాటైంది. టెక్నికల్ స్కిల్ డెవలప్‌మెంట్ ఇనిస్టిట్యూషన్ పేరుతో జేఎన్‌టీయూ(ఏ) క్యాంపస్ కళాశాలలో ఏర్పాటు చేసిన ఈ ప్రోగ్రామ్ ద్వారా 19,864 మంది ఇప్పటికే శిక్షణ పొందారు. గూగుల్, అమెజాన్, యుడేసిటీ, కోర్సెర్, డసాల్ట్ కంపెనీల సర్టిఫికెషన్ కోర్సుతో శిక్షణ ఇప్పిస్తున్నారు.

ప్రగతి పథంలో దూసుకెళుతూ..

వర్సిటీ పరిధిలో జూనియర్ అధ్యాపకులను ప్రోత్సహించేందుకు రూ.లక్ష సీడెడ్ ఫండ్‌ను కేటాయించారు. ఎంత మంది అధ్యాపకులు దరఖాస్తు చేసుకున్నా అందరికీ లబ్ధి చేకూరే వెసులుబాటు కల్పించారు. తద్వారా పరిశోధనలు పెరిగేలా చర్యలు తీసుకున్నారు. ప్రొఫెసర్లు పేటెంట్లు పొందేందుకు వీలుగా ప్రత్యేకంగా డైరెక్టరేట్‌ను ఏర్పాటు చేశారు. పేటెంట్ దరఖాస్తు చేయడానికి అయ్యే రుసుంను వర్సిటీనే భరిస్తోంది. .దీంతో ఏకంగా 13 మంది ప్రొఫెసర్లకు వారి పరిశోధనలపై పేటెంట్ దక్కింది. విద్యార్థి ఆధారిత కేంద్రంగా విద్యా ప్రణాళికకు రూపకల్పన చేశారు. 40 శాతం మూక్స్(మాసివ్ ఓపెన్ ఆన్‌లైన్ కోర్సులు)ద్వారా కోర్సులు పూర్తి చేసేందుకు అవకాశం కల్పించారు. వర్సిటీ అనుబంధ ఇంజినీరింగ్ కళాశాలల్లోని అధ్యాపకులకు నూతన కోర్సుల్లో అవగాహన పెంపొందించడానికి ఫ్యాకల్టీ డెవలప్‌మెంట్ ప్రోగ్రామ్స్ నిర్వహించారు. ఈ క్రమంలోనే ఎంటెక్ (టన్నెల్స్ అండ్ బ్రిడ్జెస్) కోర్సు నిర్వహించేందుకు భారత ప్రభుత్వం రూ.6.5 కోట్ల విలువ చేసే ప్రాజెక్ట్‌ను మంజూరు చేసింది. ఇందులో ఐఐటీ, ఎన్‌ఐటీలో ఉన్న ప్రొఫెసర్లను నియామకం చేస్తున్నారు. తారుకు రబ్బరు మిశ్రమం చేసి వేసే రబ్బరు రోడ్ల నిర్మాణానికి సంబంధించి విశేషమైన పరిశోధనలు జరుగుతున్నాయి. ఈ ప్రాజెక్ట్‌లు దక్కిన తొలి వర్సిటీగా జేఎన్‌టీయూ(ఏ) ఖ్యాతి దక్కించుకుంది. ఫార్మసీ కళాశాలలో బీ–ఫార్మసీ సీట్లను 60 నుంచి 100కు పెంచారు. వర్సిటీలోని అన్ని ల్యాబ్‌ల ఆధునీకరణ పూర్తయింది. విద్యార్థులు తమ సర్టిఫికెట్లు భద్రపరుచుకునేందుకు వీలుగా డిజీ లాకర్‌ను అందుబాటులోకి తెచ్చారు. అకడమిక్ క్రెడిట్ బ్యాంక్‌ను ఏర్పాటు చేసి ఇందులో క్రెడిట్స్‌ను డిపాజిట్ చేసి, రెగ్యులర్ కోర్సులకు వాటిని అనుసంధానం చేసి గణనీయమైన మార్కులు పొందే వెసులుబాటు కల్పించారు. కెరీర్ అడ్వాన్స్‌మెంట్ స్కీం కింద అసిస్టెంట్ నుంచి అసోసియేట్, అసోసియేట్ నుంచి ప్రొఫెసర్ పోస్టులకు పదోన్నతులు దక్కాయి. క్యాంపస్ డ్రైవ్ నిర్వహించి గత నాలుగు సంవత్సరాల్లో 1220 మంది విద్యార్థులకు గణనీయమైన కంపెనీల్లో కొలువులు దక్కాయి.

న్యాక్ గుర్తింపే నాణ్యతకు గీటురాయి



వర్సిటీ ఉన్నత విద్య ప్రమాణాలు, నాణ్యతకు న్యాక్ గుర్తింపు గీటురాయిగా నిలుస్తోంది. ఈ క్రమంలో న్యాక్ గుర్తింపు దక్కేలా అన్ని విధాలుగా చర్యలు తీసుకున్నాం. ఇప్పటికే న్యాక్ మాక్ పీర్ కమిటీ అన్ని విభాగాలనూ పరిశీలించింది. లోటుపాట్లను గుర్తించి అందుకు అనుగుణంగా మార్పు చేశాం. న్యాక్ మంచి గ్రేడింగ్ వస్తుందనే నమ్మకంతో ఉన్నాం.

– డాక్టర్ జీవీఆర్ శ్రీనివాసరావు, వీసీ, జేఎన్‌టీయూ(ఏ)

ఎనిమిదేళ్ల తర్వాత తల్లిదండ్రుల చెంతకు!

- తప్పిపోయిన బాలిక అప్పగింత



బాలికను తల్లిదండ్రులకు అప్పగిస్తున్న సీడబ్ల్యూసీ చైర్‌పర్సన్ మేడా రామలక్ష్మి, సభ్యులు

అనంతపురం సిటీ: ఊహ తెలియని వయసులో తప్పిపోయిన ఓ చిన్నారిని ఎనిమిదేళ్ల తర్వాత సురక్షితంగా తల్లిదండ్రుల వద్దకు అధికారులు చేర్చారు. ఇక లేదు.. రాదు అనుకున్న బిడ్డ తమ చెంతకు చేరుకోవడంతో ఆ తల్లిదండ్రుల ఆనందానికి అవధుల్లేకుండా పోయింది. వివరాలు... శ్రీసత్యసాయి జిల్లా కొత్తచెరువుకు చెందిన అంజినమ్మ, శ్రీరాముడు దంపతుల కుమార్తె సాయిలీల తల్లిదండ్రులు మందలించడంతో 2017, డిసెంబర్ 8న ఇల్లు వదిలి బసంపల్లికి చేరుకుంది. అక్కడి నుంచి ఎక్కడికి పోవాలో తెలియక ఏడుస్తుండడంతో గమనించిన గ్రామస్తులు అంగన్‌వాడీ కార్యకర్తల ద్వారా చైల్డ్‌లైన్ సిబ్బందికి అప్పగించారు. అదే రోజు సీడబ్ల్యూసీ ఆదేశాలతో అనంతపురంలోని బాలసదనానికి బాలికను చేర్చారు. తన ఊరు, తల్లిదండ్రుల గురించి చెప్పలేని స్థితిలో ఉన్న ఆ చిన్నారిని కేజీబీవీలో చేర్పించి విద్యాబుద్ధులు చెప్పించారు. ఈ క్రమంలో ఇటీవల సాయిలీలను సీడబ్ల్యూసీ చైర్‌పర్సన్ మేడా రామలక్ష్మి కలసి ఆరా తీస్తే తమది కొత్తచెరువు అని తెలిపింది. అన్నం అడుక్కునేందుకు ఇంటి వచ్చిన తాను దారి తప్పినట్లుగా వివరించింది. దీంతో రామలక్ష్మి ఆదేశాలతో ఐసీపీఎస్ ప్రొటెక్షన్ ఆఫీసర్ నాగలక్ష్మి, అనంతపురానికి చెందిన ఔట్ రీచర్ రమాదేవి రంగంలో దిగి బాలిక తెలిపిన వివరాల మేరకు తల్లిదండ్రుల ఆచూకీ కోసం ప్రయత్నించారు. అయితే వారు ఊరూరా తిరుగుతూ భిక్షాటన చేస్తుంటారని తెలుసుకున్నారు. ఎనిమిదేళ్ల తర్వాత కనుముక్కలలో వారి జాడ కనుగొని, బుధవారం అనంతపురానికి పిలుచుకొచ్చారు. బాలిక తెలిపిన వివరాలు, తలిదండ్రులు చెప్పిన వివరాలు సరిపోల్చుకుని కౌన్సెలింగ్ అనంతరం సాయిలీలను అప్పగించారు. కార్యక్రమంలో సీడబ్ల్యూసీ చైర్‌పర్సన్ మేడా రామలక్ష్మి, సభ్యులు లక్ష్మీ కామేశ్వరి, ఓబుళపతి, డీఈఓ అబ్దుల్, డిస్ట్రిక్ట్ చైల్డ్ ప్రొటెక్షన్ ఆఫీసర్ నాగలక్ష్మి, జిల్లా బాలల సంరక్షణ సమితి ఔట్రీచ్ వర్కర్ రమాదేవి పాల్గొన్నారు.

కాలవ డబ్బా.. డొల్లేనబ్బా!

- అభాసుపాలైన కాలవ తీరు
- ఎన్నికలకు ముందు కుయుక్తులు
- బలవంతంగా భుజంపై కండువా వేసి పార్టీలో చేరినట్లు హంగామా



శ్రీనివాసులతో కలసి విలేకరుల సమావేశం నిర్వహిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

రాయదుర్గం: ప్రజల్లో ఉనికి కోల్పోయిన టీడీపీ నేత కాలవ శ్రీనివాసులు ఎన్నికల ముందు కుయుక్తులకు తెరలేపుతున్నారు. వైఎస్సార్ సీపీ నాయకులకు బలవంతంగా తమ పార్టీ కండువాలు వేసి టీడీపీలో చేరారంటూ డబ్బాలు కొట్టుకుంటున్నారు. తీరా అంతా అబద్ధమేనని తేలాక తెల్ల మొహం వేస్తున్నారు. అందుకు బుధవారం జరిగిన ఈ ఘటనే ఉదాహరణ. పట్టణంలోని 9వ వార్డులో వైఎస్సార్‌సీపీ పట్టణ కన్వీనర్ అరవ శివప్ప సోదరుడు శ్రీనివాసులు బుధవారం ఉదయం టిఫిన్ తినేందుకు బంధువుల ఇంటి వద్దకు వెళ్తుండగా, టీడీపీ నేతలు ఆపారు. బలవంతంగా ఆయన భుజంపై టీడీపీ కండువా వేశారు. తమ పార్టీలో చేరాడంటూ నానా హంగామా చేశారు. ఈ క్రమంలోనే అక్కడకు చేరుకున్న కాలవ శ్రీనివాసులు ఆయనతో పాటు టీడీపీకే చెందిన మరో 40 కుటుంబాల వారికి పార్టీ కండువాలు వేసి పెద్ద సంఖ్యలో చేరారంటూ డబ్బా కొట్టుకున్నారు.

నీచ రాజకీయాలు మానుకో కాలవా..

ఈ కార్యక్రమం జరిగిన కొద్దిసేపటికే అసలు బాగోతం వెలుగుచూసింది. తమకు బలవంతంగా టీడీపీ కండువాలు కప్పారంటూ వారంతా మండిపడ్డారు. ఈ సందర్భంగా పట్టణ కన్వీనర్ శివప్ప, చేనేత, జౌళి శాఖ జిల్లా అధ్యక్షులు కూన నాగప్ప, పార్టీ నాయకుడు పొరాళ్ల శివ, కౌన్సిలర్లు పొరాళ్ల గోవిందరాజులు, కొంతెం దేవరాజు, తట్టే మంజు, వార్డు ఇన్‌చార్జులు స్టోర్ బుజ్జి, దివాకర్, గోరంట్ల సత్యనారాయణ, నిజామ్ మాట్లాడుతూ కుటుంబాల మధ్య చీలికలు తెచ్చే నీచ రాజకీయాలను కాలవ శ్రీనివాసులు మానుకోవాలన్నారు. అయినా, టీడీపీ దివాళా తీసిన పార్టీ అని ధ్వజమెత్తారు. ఎన్నికల తర్వాత మునిగిపోయే నావను ఎక్కాలని ఎవరు కోరుకుంటారో చెప్పాలంటూ నిలదీశారు.

అప్రమత్తంగా ఉండాలి

- పోలీసు అధికారులకు ఎస్పీ ఆదేశం



మాట్లాడుతున్న ఎస్పీ కేకేఎన్ అన్బురాజన్

అనంతపురం: సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో పోలీసు అధికారులు అప్రమత్తంగా ఉండాలని జిల్లా ఎస్పీ కేకేఎన్ అన్బురాజన్ అన్నారు. జిల్లాలోని పోలీసు అధికారులతో నెలవారీ నేర సమీక్ష ఎస్పీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళలపై నేరాలు జరగకుండా ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. సార్వత్రిక ఎన్నికల దృష్ట్యా ప్రణాళికతో ముందుకెళ్లాలన్నారు. ఫ్యాక్షన్ గ్రామాలపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. నేర చరిత్ర ఉన్న వారిపై ప్రత్యేక నిఘా కొనసాగించాలన్నారు. రోడ్డు ప్రమాదల కట్టడికి కృషి చేయాలన్నారు. మిస్సింగ్ కేసులు, గుర్తు తెలియని మృతదేహాల కేసులకు త్వరితగతిన పరిష్కారం చూపాలన్నారు. తీవ్రమైన కేసుల్లో నిందితులకు శిక్షలు పడేలా చూడాలన్నారు. విజిబుల్ పోలీసింగ్ పెంచాలన్నారు. ఇసుక, మద్యం అక్రమ రవాణా అరికట్టాలన్నారు. గంజాయి, మట్కా, పేకాట, బెట్టింగ్ ముఠా ఆట కట్టించాలన్నారు. పోలీసుస్టేషన్‌కు వచ్చే ప్రజల సమస్యలను సావధానంగా విని, చట్టపరిధిలో న్యాయం చేయాలని సూచించారు. హోదాలు మరచి సమష్టిగా పనిచేయాలని, జిల్లాలో శాంతిభద్రతల పరిరక్షణకు పకడ్బందీ చర్యలు చేపట్టాలని హితవుపలికారు.

ఉత్తమ పనితీరుకు అభినందనలు..

నార్పల మండల పరిధిలో ఇటీవల మహిళ హత్య కేసును తక్కువ వ్యవధిలో ఛేదించిన అనంతపురం రూరల్ సబ్ డివిజన్ , శింగనమల సర్కిల్ అధికారులను ఎస్పీ ప్రత్యేకంగా అభినందించారు. కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీలు ఆర్. విజయభాస్కర్ రెడ్డి, జి. రామకృష్ణ, డీఎస్పీలు బి. శ్రీనివాసులు, సీఎం గంగయ్య, శివభాస్కర్ రెడ్డి, జి. ప్రసాద రెడ్డి, బీవీ శివా రెడ్డి, మునిరాజా (ఏఆర్). ట్రైనీ డీఎస్పీ హేమంత్ కుమార్, జిల్లాలోని సీఐలు, ఆర్ఐలు తదితరులు పాల్గొన్నారు.

రూ.2 లక్షల నగదు అపహరణ

యల్లనూరు: పట్టపగలే ఇంట్లోకి చొరబడిన దుండగుడు రూ. 2లక్షలు నగదు అపహరించుకెళ్లారు. పోలీసులు తెలిపిన మేరకు... యల్లనూరులోని జెడ్పీ ఉన్నత పాఠశాల వద్ద నివాసముంటున్న పిన్నదరి నాగరంగయ్య బుధవారం తన కుటుంబసభ్యులతో కలసి పొలానికి వెళ్లాడు. జెడ్పీహెచ్‌ఎస్‌లో చదువుకుంటున్న కుమార్తె మధ్యాహ్నం విశ్రాంత సమయంలో ఇంటికి చేరుకుంది. తలుపులు తీసి ఉండడంతో నాన్న అంటూ పిలుస్తూ లోపలకు ప్రవేశించింది. అదే సమయంలో ఓ ఆగంతకుడు ఆమెను పక్కకు తోసి బయటకు పరుగు తీశాడు. కుమార్తె ద్వారా విషయం తెలుసుకున్న నాగరంగయ్య వెంటనే ఇంటికి చేరుకుని పరిశీలించాడు. బీరువాలో ఉంచిన రూ.2లక్షల నగదు కనిపించకపోవడంతో చోరీ అయినట్లు గుర్తించి పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఎస్‌ఐ అనిల్‌కుమార్ ఆధ్వర్యంలోని క్లూస్ టీం రంగంలో దిగి ఆధారాలు సేకరించింది. ఘటనపై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టినట్లు సీఐ సుబ్రహ్మణ్యం తెలిపారు.


ముగ్గురు తహసీల్దార్ల బదిలీ రద్దు

అనంతపురం అర్బన్: ముగ్గురు తహసీల్దార్ల బదిలీని రద్దు చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. పెద్దవడుగూరు తహసీల్దారు నాగభూషణం ఈ ఏడాది జూన్ 30లోపు ఉద్యోగ విరమణ చేయనున్నారు. ఎన్నికల మార్గదర్శకాల ప్రకారం ఆయన బదిలీని రద్దు చేశారు. అలాగే వైఎస్సార్ జిల్లా కలెక్టరేట్ ఏఓగా ఉన్న విజయకుమార్‌ను అనంతపురం జిల్లాకు చేసిన బదిలీని రద్దు చేస్తూ ఆయనను అదే జిల్లాలోనే ఎన్నికలకు సంబంధం లేని పోస్టులో నియమించేలా ఉత్తర్వులు జారీ అయ్యాయి. వైఎస్సార్ జిల్లా ఓబుళవారిపల్లి తహసీల్దారు వి.పుల్లారెడ్డిని బదిలీ చేయకుండా అక్కడే ఉంచారు. తాజాగా ఆ ఉత్తర్వులను రద్దు చేస్తూ ఆయనను శ్రీసత్యసాయి జిల్లాకు బదిలీ చేశారు.

సేవాలాల్ ట్రస్ట్ పేరిట అక్రమ వసూళ్లు

గుత్తి రూరల్: మండలంలోని సేవాగఢ్‌లో ఈ నెల 13 నుంచి మూడు రోజుల పాటు జరిగే సేవాలాల్ మహారాజ్ జయంత్యుత్సవాలను పురస్కరించుకుని కొందరు అక్రమ వసూళ్లకు తెరతీశారు. దీంతో అప్రమత్తమైన ట్రస్ట్ అధ్యక్షుడు కొర్రా జగన్నాథ రావు, ఉపాధ్యక్షుడు కేశవనాయక్, రవీంద్రనాయక్ బుధవారం మాట్లాడుతూ... ఎవరూ విరాళాలు ఇవ్వబోరాదని విజ్ఞప్తి చేశారు. కొందరు ట్రస్ట్ పేరు చెప్పి భారీగా డబ్బు వసూలు చేస్తున్నట్లు తమ దృష్టికి వచ్చిందన్నారు. విరాళాలు ఇవ్వదలుచుకుంటే ట్రస్ట్ కోశాధికారి బాలానాయక్ సెల్‌ఫోన్ 99306 56698కు సంప్రదించాలని సూచించారు. ఆన్‌లైన్ ద్వారా విరాళాలు ఇవ్వాలనుకునే వారు గుత్తిలోని స్టేట్ బ్యాంకు శాఖలో ఉన్న ట్రస్ట్ ఖాతా నంబర్ 33167788064, ఐఎఫ్‌ఎస్‌సీ కోడ్–ఎస్‌బీఐఎన్ 0000976కు పంపాలని కోరారు. విరాళం అందించిన అనంతరం కోశాధికారి నుంచి రసీదు తప్పనిసరిగా పొందాలన్నారు.

ద్విచక్ర వాహనాల ఢీ – ఒకరి మృతి



మృతుడు రామన్న

ఉరవకొండ: ద్విచక్ర వాహనాలు పరస్పరం ఢీకొన్న ఘటనలో ఓ వ్యక్తి మృతి చెందాడు. పోలీసులు తెలిపిన మేరకు... ఉరవకొండ మండలం ఆమిద్యాల గ్రామానికి చెందిన దాసరి రామన్న (39) బుధవారం ఉరవకొండ నుంచి తన స్వగ్రామానికి ద్విచక్ర వాహనంపై బయలుదేరాడు. జాతీయ రహదారిపై రాములమ్మ ఆలయం సమీపంలోకి చేరుకోగానే ఎదురుగా కోనాపురం నుంచి ద్విచక్ర వాహనంపై వస్తున్న వంశీ ఢీకొన్నాడు. ఘటనలో తీవ్రంగా గాయపడిన రామన్న అక్కడికక్కడే మృతి చెందాడు. తీవ్రంగా గాయపడిన వంశీని మెరుగైన చికిత్స కోసం అనంతపురానికి తరలించారు. కాగా, మృతుడికి భార్య వరలక్ష్మి, ఓ కుమారుడు ఉన్నారు. ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.


యువకుడి దుర్మరణం



హర్షవర్ధన్ (ఫైల్)

బత్తలపల్లి: ట్రాక్టర్‌ను ఢీకొన్న ఘటనలో ద్విచక్ర వాహనంపై వెళుతున్న ఓ యువకుడు దుర్మరణం పాలయ్యాడు. పోలీసులు తెలిపిన మేరకు... బత్తలపల్లి మండలం ఈదుల ముష్టూరు గ్రామానికి చెందిన నాగభూషణ, శివమ్మ దంపతులకు ఇద్దరు కుమారులు, ఇద్దరు కుమార్తెలున్నారు. ఆరేళ్ల క్రితం అనారోగ్యంతో నాగభూషణ మృతి చెందాడు. అప్పటి నుంచి కూలి పనులతో కుటుంబానికి పెద్ద కుమారుడు హర్షవర్ధన్(20) అండగా నిలిచాడు. బుధవారం సాయంత్రం బత్తలపల్లికి వచ్చిన హర్షవర్ధన్‌కు అమ్మ చెల్లెలు (పిన్నమ్మ) ఈశ్వరమ్మ కనిపించింది. ఆమె చేతిలో కేక్‌ను గమనించిన హర్షవర్ధన్ ఎందుకంటూ ఆరా తీశాడు. దీంతో తన కుమారుడి పుట్టిన రోజు విషయం ఆమె తెలిపి అమ్మను పిలుచుకుని రమ్మని కోరింది. దీంతో శివమ్మను పిలుచుకుని వచ్చేందుకు రాత్రి ఈదుల ముష్టూరుకు ద్విచక్ర వాహనంపై బయలుదేరిన హర్షవర్ధన్... రాఘవంపల్లి బస్‌స్టాప్ సమీపంలోకి చేరుకోగానే ఎదురుగా వెళుతున్న ట్రాక్టర్‌ను వెనుక నుంచి ఢీకొన్నాడు. దీంతో తల ఛిద్రమై అక్కడికక్కడే మృతి చెందాడు. విషయం తెలుసుకున్న వెంటనే కుటుంబసభ్యులు అక్కడకు చేరుకుని బోరున విలపించారు. ఘటనపై ఎస్‌ఐ శ్రీనివాసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు. కాగా, సమాచారం అందుకున్న వైఎస్సార్‌సీపీ నాయకులు ముష్టూరు నరసింహారెడ్డి, చిట్టిబాల ఓబిరెడ్డి తదితరులు మృతుని కుటుంబసభ్యులను పరామర్శించి, ధైర్యం చెప్పారు.

యువకుడి బలవన్మరణం



మృతుడు అజయ్‌కుమార్

పావగడ: మానసిక రుగ్మతతో బాధపడుతున్న ఓ యువకుడు ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు తెలిపిన మేరకు.. పావగడలోని కోటె ఆంజనేయస్వామి ఆలయం వీధిలో నివాసముంటున్న బోయ వెంకటస్వామి కుమారుడు అజయ్‌కుమార్ (23) ఆటో డ్రైవర్‌గా జీవనం సాగించేవాడు. కొన్ని రోజులుగా కడుపు నొప్పితో బాధపడుతుండడంతో పలు ఆస్పత్రుల్లో చికిత్స చేయించారు. అయినా నయం కాలేదు. దీంతో మానసికంగా కుదేలైన అజయ్‌కుమార్ ఎవరితోనూ మాట్లాడకుండా ఒంటరిగా ఉండసాగాడు. దీనికి తోడు నిద్రలేమి కారణంగా మానసిక రుగ్మతకు లోనయ్యాడు. మంగళవారం రాత్రి తండ్రి, చెల్లెలు ఇంటి బయట, అజయ్‌కుమార్ ఇంట్లో లోపల నిద్రపోయారు. బుధవారం ఉదయం కుమారుడు ఎంత సేపటికీ తలుపు తీయకపోవడంతో కుటుంబసభ్యులు బలవంతంగా తలుపులు తీసి లోపలకు ప్రవేశించారు. అప్పటికే పైకప్పుకు చీరతో ఉరి వేసుకుని విగతజీవిగా వేలాడుతున్న కుమారుడిని చూసి కేకలు వేయడంతో చుట్టుపక్కల వారు అక్కడకు చేరుకుని మృతుడిని కిందకు దించారు. సమాచారం అందుకున్న ఎస్‌ఐ గురునాథ్, సిబ్బంది అక్కడకు చేరుకుని పరిశీలించి, కేసు నమోదు చేశారు.

త్రుటిలో తప్పిన పెను ప్రమాదం




స్వల్ప గాయాలతో బయటపడిన డ్రైవర్ హరి



కుప్పకూలిన పెద్దన్న

బత్తలపల్లి: మండలంలోని పోట్లమర్రి దూపులేట్ వంక వద్ద బుధవారం చోటు చేసుకున్న ప్రమాదంలో త్రుటిలో ప్రాణాలతో ఇద్దరు బయటపడ్డారు. ప్రత్యక్ష సాక్షులు తెలిపిన మేరకు... బత్తలపల్లి వైపు నుంచి బెంగళూరుకు దోసకాయలను తరలిస్తున్న అశోక లేలాండ్ మినీ లారీ దూపులేట్ వంక వద్దకు చేరుకోగానే ఎదురుగా ద్విచక్ర వాహనంపై వస్తున్న యర్రాయపల్లికి చెందిన పోస్టల్ ఉద్యోగి పెద్దన్నను డ్రైవర్ తప్పించబోయి సడన్‌గా బ్రేక్‌లు వేశాడు. ఆ సమయంలో మినీ లారీ అదుపు తప్పి రోడ్డుకు అడ్డంగా బోల్తాపడుతూ ద్విచక్ర వాహనాన్ని ఢీకొంది. ఘటనలో ధర్మవరంలోని ఇందిరమ్మకాలనీకి చెందిన డ్రైవర్ హరి, పెద్దన్న స్వల్పగాయాలతో బయటపడ్డారు. దొమ్మల్లో నొప్పి అంటూ బాధపడుతున్న పెద్దన్నను హోంగార్డు బాలు వెంటనే 108 అంబులెన్స్ ద్వారా ఆర్డీటీ ఆస్పత్రికి తరలించారు. మినీలారీ బోల్తాపడడంతో దోస కాయలు రోడ్డు పాలయ్యాయి. అటుగా వెళుతున్న ప్రయాణికులు కొన్ని చేతబట్టుకుని పోయారు. మరికొన్ని వాహనాల కింద పడి ఫగిలిపోయాయి. సమాచారం అందుకున్న బత్తలపల్లి పోలీసులు అక్కడకు చేరుకుని జేసీబీ సాయంతో మినీ లారీని రోడ్డు పక్కకు తొలగించారు.

నృసింహాలయంలో 'రాయల' శాసనాలు



న్యాయవాదికి శాసనాలను చూపిస్తున్న చరిత్రకారుడు మైనాస్వామి

కదిరి టౌన్: విజయనగర సామ్రాజ్యాధీశుడు హరిహర బుక్కరాయల కాలం నాటి సంస్కృత శాసనాలను కదిరి లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో కనుగొన్నట్లు చరిత్రకారుడు మైనాస్వామి తెలిపారు. శాసనాల సంరక్షణలో భాగంగా ఖాద్రీ లక్ష్మీనరసింహస్వామి సన్నిధిలో బుధవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఆర్‌ఎస్‌ఎస్ ప్రముఖులు, న్యాయవాది సుబ్బరాజు గుప్తా తదితరులతో కలిసి మైనాస్వామి నృసింహాలయంలో పలు శాసనాలను పరిశీలించారు. తూర్పు, పడమర రాజగోపురం ద్వారాల్లో, గుడి దక్షిణ గోడ, తూర్పు ప్రాకారంపై శాసనాల ఆనవాళ్లను గుర్తించారు. ఆలయం వెలుపల, లోపలి గోడలను శుభ్రం చేసేటపుడు శాసనాలను చెరిపివేస్తున్నారని చరిత్రకారుడు మైనా స్వామి ఆవేదన చెందారు. ఈ సందర్భంగా ఆలయ నిర్మాణ ప్రాశస్త్యాన్ని తెలిపే సామాన్యశకం 1352 నాటి మొదటి బుక్కరాయల శాసనాన్ని మైనా స్వామి చూపించారు. శాసనాన్ని బట్టి ఆలయ నిర్మాణం ప్రధాన గోపురం అప్పటికే పూర్తి అయి ఉండవచ్చన్నారు. రెండో హరిహర రాయలు, ఆయన కుమారుడు ఒకటో దేవరాయలు, విరూపాక్ష రాయలు, శ్రీకృష్ణదేవరాయలు తదితరుల శాసనాలను సంరక్షించుకోవాలని మైనా స్వామి విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో ఆలయ సిబ్బంది, పుర ప్రముఖులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

'సిద్ధం' సభ విజయవంతం చేద్దాం



సిద్ధం సభకు ప్రజలను ఆహ్వానిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

ఆత్మకూరు: రాప్తాడులో జరగనున్న సిద్ధం సభను జయప్రదం చేద్దామని వడ్డుపల్లి సర్పంచ్ లక్ష్మీనారాయణరెడ్డి పిలుపునిచ్చారు. బుధవారం మండలంలోని వడ్డుపల్లి గ్రామంలో వైఎస్సార్‌సీపీ నాయకులతో కలసి గ్రామంలో పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ప్రజా సంకల్ప యాత్రలో ఇచ్చిన హామీలను సీఎం జగన్ నెరవేర్చారన్నారు. వచ్చే ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీని గెలిపిద్దామన్నారు. ప్రతి ఒక్కరూ జగనన్నకు అండగా నిలవాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ ఓబిరెడ్డి, శివారెడ్డి, ప్రభాకర్, గోపాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అలరించిన 'జగనన్న జయకేతనం'



జగనన్న జయకేతనం నాటకంలోని ఓ సన్నివేశం

ఆత్మకూరు: మండల కేంద్రంలో బుధవారం రాత్రి జగనన్న జయకేతనం నాటకాన్ని ప్రదర్శించారు. నవరత్నాల్లో భాగంగా ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డి అందిస్తున్న సంక్షేమ పథకాలను మైకెల్ బాబు ఆధ్వర్యంలో కళాకారులకు చక్కగా వివరించారు. కార్యక్రమంలో కళాకారులు సరోజమ్మ, వెంకటేష్, నరహరి, రాజారెడ్డి, బీమలింగ, అంజిదేవి పాల్గొన్నారు.

రిజిస్ట్రేషన్ ప్రక్రియ వేగవంతం చేయండి



వివరాలు ఆరా తీస్తున్న అదనపు కమిషనర్ శ్రీహరిబాబు


అనంతపురం కార్పొరేషన్: నగరంలోని వినాయకనగర్, రాణినగర్‌లో ఉన్న సచివాలయాలను అదనపు కమిషనర్ శ్రీహరిబాబు బుధవారం ఆకస్మిక తనిఖీ చేశారు. నవరత్నాలు పేదలందరికీ ఇళ్లు కార్యక్రమంలో భాగంగా ప్రభుత్వం అర్హులైన లబ్ధిదారులకు ఇళ్ల పట్టాలను పంపిణీ చేసిందన్నారు. వీటి రిజిస్ట్రేషన్ ప్రక్రియ ఏ విధంగా చేస్తున్నారని ఆరా తీశారు. సర్వే నంబర్లు, లబ్ధిదారుడి పేరు, తదితర వివరాలను పక్కాగా నమోదు చేయాలన్నారు. నిర్దేశిత సమయంలో రిజిస్ట్రేషన్ ప్రక్రియ పూర్తి చేయాలన్నారు.

రామగిరి సీఐగా శివప్రసాద్



కనగానపల్లి: రామగిరి సర్కిల్ ఇన్‌స్పెక్టర్‌గా వి.శివప్రసాద్ బుధవారం బాధ్యతలు స్వీకరించారు. సార్వత్రిక ఎన్నికల బదిలీల్లో భాగంగా తిరుపతి ట్రాఫిక్ పోలీస్ స్టేషన్‌లో పని చేస్తున్న ఈయన్ను రామగిరి సర్కిల్‌కు బదిలీ చేసినట్లు పోలీస్ అధికారులు తెలిపారు. చెన్నేకొత్తపల్లిలోని సర్కిల్ పోలీస్ స్టేషన్‌లో బాధ్యతలు చేపట్టిన సీఐ శివప్రసాద్‌కు స్థానిక పోలీస్ సిబ్బంది పుష్పగుచ్ఛాలు ఇచ్చి స్వాగతం పలికారు.

'ఉపాధి' పనులపై సామాజిక తనిఖీ



రికార్డులు పరిశీలిస్తున్న సామాజిక తనిఖీ బృందం సభ్యులు

వజ్రకరూరు: ఉపాధి హామీ పథకం కింద 2022 ఏప్రిల్ 1 నుంచి 2023 మార్చి 31 వరకు జరిగిన పనులపై సామాజిక తనిఖీ ప్రారంభమైంది. ఎస్‌ఆర్‌పీ లోకేష్‌తో పాటు డీఆర్పీలతో కూడిన సామాజిక తనిఖీ బృందం బుధవారం వజ్రకరూరుకు చేరుకుని రికార్డులు స్వాధీనం చేసుకుంది. ఉపాధి హామీ పనులకు రూ.7.92 కోట్లు వ్యయం చేసినట్లు ఏపీఓ లక్ష్మీబాయి వెల్లడించారు. ఉపాధి హామీ పనులతో పాటు హౌసింగ్, పంచాయతీరాజ్, ఫారెస్ట్, ప్రభుత్వ పాఠశాలల్లో ప్రహరీల నిర్మాణాలు తదితర వాటిని కూడా తనిఖీలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఎస్‌ఆర్‌పీ లోకేష్ మాట్లాడుతూ గ్రామస్థాయిలో ఉపాధి పనులు చేసిన కూలీల వద్దకు వెళ్లి వివరాలు సేకరించడంతో పాటు క్షేత్రస్థాయిలో తనిఖీలు పక్కాగా చేస్తామన్నారు.

పూర్తిస్థాయిలో నీటి సరఫరాకు చర్యలు

• మేయర్ వసీం



మున్సిపల్ అధికారులతో మాట్లాడుతున్న మేయర్ వసీం

అనంతపురం కార్పొరేషన్: నగర ప్రజలకు పూర్తిస్థాయిలో నీటి సరఫరా చేసేందుకు చర్యలు తీసుకోనున్నట్లు మేయర్ వసీం పేర్కొన్నారు. బుధవారం పీఏబీఆర్ డ్యామ్ పంపింగ్ కేంద్రాన్ని డిప్యూటీ మేయర్లు కోగటం విజయభాస్కర్ రెడ్డి, వాసంతి సాహిత్యతో కలిసి పరిశీలించారు. నీటి పంపింగ్ తీరును సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. ప్రస్తుతం ఒక మోటరు ద్వారానే నీటిని పంపింగ్ చేస్తున్నామని, దీంతో పూర్తి స్థాయిలో తాగునీటిని అందివ్వలేకపోతున్నట్లు ఇంజినీరింగ్ అధికారులు మేయర్‌కు వివరించారు. మేయర్ మాట్లాడుతూ.. పీఏబీఆర్ డ్యామ్ పంపింగ్ కేంద్రంలో మూడు మోటర్లు ఉండగా రెండు మోటర్లు కాలిపోవడంతో నీటి సరఫరాకు కొంత మేర ఇబ్బంది తలెత్తిందన్నారు. 2009లో కొనుగోలు చేసిన మోటర్లు కావడంతో ఈ సమస్య వచ్చిందన్నారు. తమ ప్రభుత్వంలో కొనుగోలు చేసిన మోటర్ వల్ల ప్రస్తుతం నీటి పంపింగ్ కొనసాగుతోందన్నారు. మోటర్లకు త్వరితగతిన మరమ్మతులు చేయించి ఈనెల 13వ తేదీలోపు నగరవాసులకు పూర్తిస్థాయిలో నీటి సరఫరా చేసేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. నీటిని పొదుపుగా వాడుకోవాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. హైదరాబాద్ జీహెచ్ఎంసీ నుంచి ప్రత్యేకంగా వచ్చిన ప్రతినిధితో అత్యాధునిక మోటర్ ఏర్పాటుపై చర్చించారు. కార్యక్రమంలో ఎస్ఈ రామమోహన్ రెడ్డి, కార్పొరేటర్లు సైపుల్లాబేగ్, కమల్‌భూషణ్, రహంతుల్లా, బాబా ఫక్రుద్దీన్, అనిల్‌కుమార్ రెడ్డి పాల్గొన్నారు.

దివ్యాంగుడికి 'అమ్మ' చేయూత



లక్ష్మయ్యతో రమణారెడ్డి

అనంతపురం కల్చరల్: అమ్మ సంస్థ వ్యవస్థాపకుడు తరిమెల రమణారెడ్డి దివ్యాంగుడికి అండగా నిలిచారు. వివరాలు.. ధర్మవరానికి చెందిన లక్ష్మయ్య అనే వ్యక్తి రోళ్లు కొట్టి జీవించేవాడు. అలా ఓ రోజు రోలు తయారు చేస్తున్నప్పుడు ప్రమాదవశాత్తూ తన ఎడమ చేతిని పోగొట్టుకొన్నాడు. అయినా ఆత్మవిశ్వాసంతో చాలా ఏళ్లు ఒంటి చేత్తోనే వృత్తిని కొనసాగించాడు. కానీ వయస్సు మీద పడుతున్న కొద్దీ పని చేయడం భారమై ఇబ్బందులు పడుతున్నాడు. విషయం తెలుసుకున్న అమ్మ సంస్థ అధ్యక్షుడు తరిమెల రమణారెడ్డి బుధవారం దివ్యాంగుడు లక్ష్మయ్యకు రూ.40 వేల నగదు, మరో రూ.40 వేలు విలువ చేసే నిత్యావసరాలు అందించారు. అలాగే రూ.20 వేలు విలువ చేసే ఫ్రిడ్జ్ అందజేశారు. త్వరలో కృత్రిమ చేయి కూడా అందజేస్తానని హామీ ఇచ్చారు. ఇంటివాళ్లకు కూడా అండగా నిలుస్తానని చెప్పడంతో లక్ష్మయ్య కుటుంబం రమణారెడ్డికి కృతజ్ఞతలు తెలిపింది.

మైనార్టీల సంక్షేమానికి కృషి చేయాలి



మైనార్టీ సంక్షేమ శాఖ డీడీ రామసుబ్బారెడ్డిని కలిసిన మైనార్టీ ఉద్యోగుల సంక్షేమ సంఘం నాయకులు

అనంతపురం రూరల్: ముస్లిం మైనార్టీల సంక్షేమం కోసం కృషి చేయాలని మైనార్టీ సంక్షేమ శాఖ డిప్యూటీ డైరెక్టర్ రామ సుబ్బారెడ్డిని మైనార్టీ వెల్ఫేర్ అసోసియేషన్ నాయకులు కోరారు. ఇటీవల మైనార్టీ వెల్ఫేర్ ఏడీగా బాధ్యతలు చేపట్టిన రామసుబ్బారెడ్డిని బుధవారం మైనార్టీ ఉద్యోగుల సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు షేక్ షాషావలి, ప్రధాన కార్యదర్శి ఫరూక్, సహాయ అధ్యక్షుడు ఫక్రుద్దీన్ కలిశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ప్రభుత్వం అందించే జగనన్న వసతి దీవెన, విద్యాదీవెన అర్హులందరికీ అందించాలన్నారు. 15 సూత్రాల పథకాన్ని అమలు చేయడంతో పాటు, మైనార్టీ వసతి గృహాల పనితీరుపై దృష్టి సారించాలని సూచించారు. ముస్లిం మైనార్టీ ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో సంఘం నాయకులు ఏడీ రసూల్, అమీర్, ఇక్బాల్, అన్వర్ తదితరులు పాల్గొన్నారు.

'యాత్ర-2'కు మద్దతుగా విద్యార్థుల జైత్రయాత్ర



ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు

అనంతపురం ఎడ్యుకేషన్: ఢిల్లీని ఢీకొట్టిన తెలుగోడి పౌరుషానికి ప్రతీక యాత్ర -2 సినిమాఅని వైఎస్సార్ కాంగ్రెస్ విద్యార్థి విభాగం రాష్ట్ర అధ్యక్షుడు పానుగంటి చైతన్య అన్నారు. ప్రజానాయకుడిగా, ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఎదిగిన తీరుకు అద్దం పట్టేలా చిత్రీకరించిన యాత్ర - 2 సినిమా విడుదల సందర్భంగా బుధవారం అనంతపురంలో విద్యార్థులు భారీ జైత్రయాత్ర చేపట్టారు. విద్యార్థి విభాగం జిల్లా అధ్యక్షుడు సుధీర్ ఆధ్వర్యంలో స్థానిక సప్తగిరి సర్కిల్ నుంచి జిల్లా పరిషత్ కార్యాలయం వరకూ ర్యాలీ కొనసాగింది. పెద్ద సంఖ్యలో పాల్గొన్న విద్యార్థులు 'జగనే జనం.. జగనే నిజం.. జగన్ జగన్ జన ప్రభంజనం' అంటూ నినాదాలతో హోరెత్తించారు. ముఖ్య అతిథిగా హాజరైన పానుగంటి చైతన్య మాట్లాడుతూ... రాష్ట్రంలో విద్యార్థుల ప్రయోజనాలు, విద్యారంగ సంస్కరణలపై మొట్టమొదట ఆలోచన చేసిన ముఖ్యమంత్రి దివంగత డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి అని గుర్తు చేశారు. ఫీజు రీయింబర్స్‌మెంట్‌తో నిరుపేదల విద్యాభివృద్ధికి రాజన్న ఒకడుగు ముందుకు వేస్తే... విప్లవాత్మకమైన సంస్కరణలతో ఆయన తనయుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మొత్తం వ్యవస్థనే సమూలంగా మార్చివేశారన్నారు. వైఎస్సార్ అకాల మరణం తర్వాత కాంగ్రెస్ పార్టీ ఎలా వైఎస్ జగన్‌ను ఒంటరి చేసి వేధించిందో... అంతా కలసి కుట్ర పన్ని ఆయనను ఎలా జైలు పాలు చేశారో.. జైలు జీవితం తర్వాత ఆయన పాదయాత్ర ద్వారా ప్రజలకు ఎలా చేరువయ్యారు.. ఎన్నికల్లో గెలిచి తండ్రి అడుగుజాడల్లో ముందుకు సాగుతూ ఆయన ఆశయాల సాధనకు కృషి చేసిన తీరుకు అద్దం పట్టే రీతిలో యాత్ర - 2 నిర్మించారని వివరించారు. 2019 వరకు ఏపీలో జరిగిన రాజకీయ పరిణామాల నేపథ్యంతో సాగిన ఈ కథనం సినిమా కాదనీ.. వాస్తవాలకు ప్రతిబింబమన్నారు. ప్రతిఒక్కరూ తప్పనిసరిగా ఈ సినిమా చూసి.. వాస్తవాలు గ్రహించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో విద్యార్థి విభాగం రాష్ట్ర కార్యదర్శి షెక్షావలి, జిల్లా ప్రధాన కార్యదర్శి విజయ్ రెడ్డి, జిల్లా నేతలు నితిన్ రెడ్డి, కిరణ్, అనిల్, నవీన్, బాబు, జిలాన్, మల్లి తదితరులు పాల్గొన్నారు.

13 నుంచి సేవాలాల్ జయంత్యుత్సవాలు



పోస్టర్లు ఆవిష్కరిస్తున్న సీనియర్ డీపీఓ చౌహాన్

గుంతకల్లుటౌన్: బంజారాల ఆరాధ్య దైవం సంత్ సేవాలాల్ మహరాజ్ వెలసిన సేవాఘడ్ క్షేత్రంలో ఈ నెల 13 నుంచి 15 వరకు వైభవంగా జరిగే జయంత్యుత్సవాలను జయప్రదం చేయాలని రైల్వే సీనియర్ డీపీఓ జయశంకర్ చౌహాన్, ఏడీఎన్ రామస్వామి నాయక్ పిలుపునిచ్చారు. బుధవారం స్థానిక భాగ్యనగర్‌లోని సేవాలాల్ గుడి వద్ద సేవాలాల్ మహరాజ్ 285వ జయంత్యుత్సవాల వాల్‌పోస్టర్లను వారు విడుదల చేశారు. సేవాలాల్ జయంతి, జగదంబ మాత వార్షికోత్సవాలకు దేశంలోని తండాల నుంచి బంజారా సోదర,సోదరీమణులు భారీగా తరలిరావాలని కోరారు. కార్యక్రమంలో సేవాలాల్ ట్రస్ట్ అదనపు ప్రధాన కార్యదర్శి వెంకటరమణ నాయక్, సభ్యులు రూప్లానాయక్, తిరుపాల్‌నాయక్, సోమ్లానాయక్, నారాయణ నాయక్, రాము నాయక్ తదితరులు పాల్గొన్నారు.

పంట నష్టపరిహారం ఇవ్వాలి

అనంతపురం అర్బన్: గత ఖరీఫ్, రబీలో పంటలు నష్టపోయిన రైతులకు పరిహారం ఇవ్వాలని సీపీఎం నాయకులు కోరారు. బుధవారం కలెక్టరేట్ వద్ద ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆ పార్టీ జిల్లా కార్యదర్శి రాంభూపాల్ మాట్లాడుతూ.. కరువు రైతులను ప్రభుత్వాలు ఆదుకోకపోతే పేద, చిన్న, సన్నకారు రైతులు వ్యవసాయం చేయలేని పరిస్థితి ఏర్పడుతుందన్నారు. స్కేల్ ఆఫ్ ఫైనాన్స్ ఆధారంగా పంట నష్టపరిహారం చెల్లించాలన్నారు. అనంతపురం రూరల్ మండలం రాజీవ్ కాలనీ పంచాయతీలో పేదలు వేసుకున్న గుడిసెలకు పట్టాలు ఇచ్చి రక్షణ కల్పించాలన్నారు. గార్లదిన్నె మండలం కల్లూరులో పేదలకు ఇళ్లను నిర్మించి ఇవాలన్నారు. కార్యక్రమంలో నాయకులు బాలరంగయ్య, నల్లప్ప, రామిరెడ్డి, నాగేంద్రకుమార్, వెంకటనారాయణ, ముస్కిన్ పాల్గొన్నారు.

బాలల హక్కులను పరిరక్షించాలి

గుంతకల్లు: ప్రతి ఒక్కరూ బాలల హక్కులను పరిరక్షించాలని వక్తలు పేర్కొన్నారు. జిల్లా బాలల హక్కుల పరిరక్షణ సమితి ఆధ్వర్యంలో పట్టణంలోని రైల్వే ఇంగ్లిష్ మీడియం హైస్కూల్‌లో బాలల హక్కులపై అవగాహన సదస్సు ఏర్పాటు చేశారు. ప్రిన్సిపాల్ మధుసూదన్ రావు అధ్యక్షత వహించగా వక్తలు బాల్య వివాహాల నిషేధ చట్టం, పిల్లలపై లైంగిక దాడుల నిరోధక చట్టంపై వివరించారు. పిల్లల హక్కులకు భంగం కలిగితే 1098 చైల్డ్ హెల్ప్‌లైన్‌కు ఫిర్యాదు చేయాలని సూచించారు. అనంతరం డ్రాయింగ్, పెయింటింగ్ పోటీల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు సర్టిఫికెట్లు అందజేశారు. వన్‌టౌన్ ఏఎస్‌ఐ పద్మావతి, బాలల పరిరక్షణ సమితి అధికారులు వెంకటేశ్వరీ, చంద్రకళ, సోషల్ వర్కర్ వసంతలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

రైల్వే ఆస్తులకు నష్టం కలిగించొద్దు



వాహనదారులకు సూచనలిస్తున్న ఆర్‌పీఎఫ్ సీఐ రవిప్రకాశ్

అనంతపురం సిటీ: రైల్వే ఆస్తులకు నష్టం కలిగించే పనులకు ఎవరూ పాల్పడొద్దని రైల్వే ప్రొటెక్షన్ ఫోర్స్ (ఆర్‌పీఎఫ్) అనంతపురం సీఐ రవిప్రకాశ్ కోరారు. అనంతపురం రైల్వే స్టేషన్ పరిధిలోని జంగాలపల్లి, చిగిచెర్ల, ఉప్పునేసినపల్లిలో ఏఎస్‌ఐలు ప్రతాప్ నాయక్, మహమ్మద్ రఫీ, సిబ్బందితో కలిసి పర్యటించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ.. రైల్వే ఆస్తులకు నష్టం కలిగిస్తే రైల్వే యాక్ట్ ప్రకారం కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. రైల్వే ట్రాక్‌ల పక్కన పశువులు మేపడం వల్ల రైళ్ల రాకపోకలకు అంతరాయం కలగడమే కాకుండా కొన్ని సందర్భాల్లో ఘోర ప్రమాదాలు కూడా జరిగే ఆస్కారం లేకపోలేదన్నారు. అప్పుడు పెను ప్రాణనష్టం సంభవించే అవకాశాలు ఉన్నాయని హెచ్చరించారు. పశువులను మేత కోసం రైల్వే ట్రాక్‌ల పక్కన తోలుకొనిపోవద్దని కోరారు. రైళ్లపై రాళ్లు రువ్వడం, పట్టాలపై రాళ్లు పెట్టడం వంటి చర్యలను తీవ్రంగా పరిగణిస్తామని తెలిపారు. ఇటువంటి చర్యలను ఏమాత్రం సహించేది లేదని స్పష్టం చేశారు. రైళ్ల రాకపోకలు సాఫీగా సాగేలా ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు.

గుత్తికోట పరిరక్షణ అందరి బాధ్యత



క్యాలెండర్లను ఆవిష్కరిస్తున్న మ్యూజియం ఏడీ రజిత

అనంతపురం కల్చరల్: చారిత్రాత్మకమైన గుత్తికోట వైభవం అనంతకు గర్వకారణమని జిల్లా పురావస్తు శాఖ ఏడీ రజిత అన్నారు. గుత్తికోట సంరక్షణ సమితి ప్రధాన కార్యదర్శి, సీమ ఉద్యమకారులు వై.రాజశేఖరరెడ్డి నేతృత్వంలో ఏర్పాటు చేసిన గుత్తికోట వైభవం క్యాలెండర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. గుత్తి కోటను సంరక్షించుకోవడం ప్రజలందరి బాధ్యత అన్నారు. ఈ కోటపై టిప్పు సుల్తాన్, శ్రీకృష్ణదేవరాయల వంటి దిగ్గజాలు పాలన సాగించారని తెలిపారు. కోట వైభవాన్ని ఈ తరం వారికి తెలియజేయాల్సిన అవసరం ఉందన్నారు. కార్యక్రమంలో గుత్తికోట సంరక్షణ సమితి నాయకులు కాశీరావు, సలహాదారులు గురుశంకర్, యువజన కన్వీనర్ కోటేశ్వరరావు సభ్యులు మురళీ, కేదార్‌నాథ్ పాల్గొన్నారు.

స్టార్టర్ పెట్టె, కేబుల్ చోరీ

కూడేరు: ఉదిరిపికొండకు చెందిన రైతు లక్ష్మీదేవి పొలంలో వ్యవసాయ మోటర్‌కు ఏర్పాటు చేసిన కేబుల్, స్టార్టర్ పెట్టె మంగళవారం రాత్రి చోరీ అయ్యింది. బాధితురాలు బుధవారం కూడేరు పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. చోరీ అయిన వస్తువుల విలువ రూ.20 వేల వరకు ఉంటుందని తెలిపింది.

12న తొండపాడులో టెంకాయల వేలం

గుత్తి రూరల్: తొండపాడు బొలికొండ రంగనాథస్వామి ఆలయంలో బ్రహ్మోత్సవాల సందర్భంగా ఆలయ ఆవరణలో టెంకాయల విక్రయానికి ఈ నెల 12న వేలం నిర్వహించనున్నారు. ఈమేరకు ఆలయ ఈఓ దేవదాసు బుధవారం ఓ ప్రకటన విడుదల చేశారు. టెంకాయల వేలం పాటతో పాటుగా ఈ నెల 27 నుంచి 2025 పుష్యమాసం ఆఖరు వరకూ టెంకాయల విక్రయానికి మధ్యాహ్నం 12 గంటలకు వేలం పాట ఉంటుందని తెలిపారు. రూ.5వేలు డిపాజిట్ చెల్లించి వేలంలో పాల్గొనాలని సూచించారు.

పేకాటరాయుళ్ల అరెస్ట్

బొమ్మనహాళ్: మండల కేంద్రానికి సమీపంలో పేకాట ఆడుతున్న 10 మంది జూదరులను బుధవారం పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఎస్‌ఐ శ్రీనివాసులు తెలిపిన వివరాల మేరకు.. బొమ్మనహాళ్, ఉంతకల్లు గ్రామాలకు చెందిన శంకరప్ప, హనుమంత, పాండు, బసవరాజులతో పాటు మరో ఆరుగురిని అరెస్ట్ చేశారు. వారి నుంచి రూ.24,300 నగదు, 4 ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకున్నారు. నిందితులపై కేసు నమోదు చేసి కోర్టులో హాజరుపరుస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు. దాడితో సిబ్బంది రాజకుళ్లాయప్ప, జగదీష్, రుద్ర తదితరులు పాల్గొన్నారు.

పౌష్టికాహారంతో ఆరోగ్యం



పౌష్టికాహార కిట్లు అందజేస్తున్న ఐసీడీఎస్ సూపర్‌వైజర్ కొండమ్మ

అనంతపురం సెంట్రల్: గర్భిణులు, బాలింతలు, చిన్నారుల్లో పౌష్టికాహారలోపం నివారణకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ కొండమ్మ తెలిపారు. బుధవారం అశోక్‌నగర్, సాయినగర్ అంగన్‌వాడీ కేంద్రాల్లో పోషణ వేడుక కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇంటికే రేషన్ సరుకులు (టేక్‌హోమ్ రేషన్) కార్యక్రమంలో భాగంగా పౌష్టికాహార కిట్లను పంపిణీ చేశారు. మహిళలు గర్భం దాల్చిన వెంటనే అంగన్‌వాడీ కేంద్రాల్లో పేర్లు నమోదు చేసుకోవాలన్నారు. రక్తహీనతకు గురికాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన పెంచుకోవాలని సూచించారు. గర్భిణులు సరైన పౌష్టికాహారం తీసుకోకపోతే ప్రసవ సమయంలో ఇబ్బందులు పడాల్సి వస్తుందని హెచ్చరించారు. అలాగే ప్రసవించిన వెంటనే బిడ్డలకు ముర్రుపాలు పట్టించాలన్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్ జయమ్మ, మహిళా పోలీసులు సుస్మిత, రెహానా, అంగన్‌వాడీ వర్కర్లు, హెల్పర్లు పాల్గొన్నారు.

సజావుగా మార్కెట్ వేలం



వేలం నిర్వహిస్తున్న అధికారులు

అనంతపురం కార్పొరేషన్: నగరపాలక సంస్థలో బుధవారం పాతూరు కూరగాయల మార్కెట్ వేలం పాట సజావుగా సాగింది. అదనపు కమిషనర్ శ్రీహరి బాబు పర్యవేక్షణలో జరిగిన వేలంలో మొదటగా సర్కార్ సవాల్ రూ.79 లక్షలు నిర్ణయించారు. విజయ్‌కుమార్, నారాయణస్వామి గంటన్నర పాటు పోటీపడ్డారు. చివరకు రూ.87,90,000 విజయ్‌కుమార్ వేలం పాటలో సంత మార్కెట్ లీజును దక్కించుకున్నారు. ఈ సందర్భంగా అదనపు కమిషనర్ శ్రీహరిబాబు మాట్లాడుతూ.. గతేడాది మార్కెట్ లీజు రూ.76,30,000 లీజుదారుడు దక్కించుకున్నారన్నారు. ఈ ఏడాది రూ.11,30,000 అదనంగా లీజు ధర పలికిందన్నారు. కార్యక్రమంలో ఆర్‌ఓలు సతీష్, సుజాత, ఆర్‌ఐలు మురళీ, వేణుగోపాల్, బాబు, పద్మావతి, తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో షబ్-ఏ-మేరాజ్



ముస్తాబైన రెండవ రోడ్డులోని మసీదు

అనంతపురం కల్చరల్: పవిత్ర రంజాన్ పర్వదినాలకు ముందు వచ్చే షబ్-ఏ-మేరాజ్ వేడుకలు బుధవారం రాత్రి పలు మసీదుల్లో ఘనంగా జరిగాయి. స్థానిక రెండవ రోడ్డులోని మస్జిద్ ఏ బహువుద్దీన్‌లో ఆధ్యాత్మిక ప్రవచనం జరిగింది. షబ్-ఏ-మేరాజ్ విశిష్టతను ముఖ్య అతిథిగా విచ్చేసిన ఇమామ్ యూసుఫ్‌ఖాన్ తెలియజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మహమద్ ప్రవక్త (స) మస్జిద్-ఏ-హరామ్ నుంచి మస్జిద్-ఏ-అక్సా వరకూ ప్రయాణించి తన బాహ్య కళ్లతో అల్లా రబ్బుల్ ఇజ్జత్‌ను చూశాడని పవిత్ర ఖురాన్ చెబుతోందన్నారు. ఆ రోజున జరిగినట్లు విశ్వసించే ప్రార్థనలు తరాలుగా ఈ పర్వదినాన జరగడం ఆనవాయితీగా వస్తోందన్నారు. అనంతరం సామూహిక ప్రార్థనలతో వందలాది మంది ముస్లింలు ప్రత్యేక దువా చేశారు. కార్యక్రమంలో మసీదు ముతవల్లి ఫరీదుద్దీన్, సెక్రటరీ పర్వీష్, అబ్దుల్ సమి, చాంద్ బాషా తదితరులు పాల్గొన్నారు.

నులి పురుగుల నివారణతో ఆరోగ్యం



పోస్టర్లను విడుదల చేస్తున్న అధికారులు

రాప్తాడు: నులిపురుగుల నివారణంతో పిల్లలు ఆరోగ్యంగా ఉంటారని ఇన్‌చార్జి ఎంపీడీఓ రత్నబాయి అన్నారు. బుధవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో జాతీయ నులిపురుగుల దినోత్సవంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. నులిపురుగులు మనిషి పేగుల్లో మకాం వేసి రక్తాన్ని పీల్చడం ద్వారా రక్తహీనత వస్తుందన్నారు. ఇది అనారోగ్య సమస్యలకు కారణమవుతుందన్నారు. అందుకే ఈనెల 9, 16 తేదీల్లో నులి పురుగుల నివారణకు మండలంలో ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల విద్యార్థులకు ఆల్బెండజోల్ మాత్రలు వేయాలన్నారు. 19 ఏళ్ల వయస్సు ఉన్న వారికి మాత్రలు వేయాలన్నారు. 1 నుంచి రెండేళ్లలోపు పిల్లలకు 200 మిల్లీ గ్రాములు, 3 నుంచి 19 ఏళ్లలోపు పిల్లలకు 400 గ్రాములు మాత్రలు వేయాలన్నారు. మధ్యాహ్న భోజనం తర్వాత విద్యార్థులతో మింగించాలన్నారు. కార్యక్రమంలో ఎంఈఓ మల్లికార్జున, వైద్యాధికారి శివ కృష్ణ, సీహెచ్ఓ శివప్రసాద్, సూపర్‌వైజర్ నరసింహ, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ నాగరత్న, అంగన్‌వాడీ కార్యకర్తలు విజయలక్ష్మి, భారతి, ముత్యాలమ్మ, సావిత్రి తదితరులు పాల్గొన్నారు.

రక్తదానం ప్రాణదానంతో సమానం

గుత్తి: రక్తదానం ప్రాణం దానంతో సమానమని అనంతపురం ప్రభుత్వాసుపత్రి వైద్యులు సుభాష్ అన్నారు. గుత్తిలోని గేట్స్ ఇంజనీరింగ్ కాలేజీలో బుధవారం అనంతపురం ప్రభుత్వాసుపత్రి వైద్యుల ఆధ్వర్యంలో మెగా రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. అనంతపుం ప్రభుత్వాసుపత్రిలో రక్తం కొరత ఉన్నందున ఆసుపత్రి వైద్యులు గేట్స్ యాజమాన్యాన్ని సంప్రదించారు. ఈ క్రమంలో కళాశాలలో మెగా రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. గేట్స్ కాలేజీ సీఎండీ రఘునాథ్‌రెడ్డి, డైరెక్టర్ వీకే వాణి మొదట రక్తదానం చేయగా వారిని స్ఫూర్తిగా తీసుకుని సుమారు 100 మంది ఇంజినీరింగ్ విద్యార్థులు రక్తదానం చేశారు. ఈ సందర్భంగా వైద్యులు సుభాష్ మాట్లాడుతూ ప్రతి మూడు మాసాలకు ఒకసారి రక్తదానం చేయడం ద్వారా ఆరోగ్యం భేషుగ్గా ఉంటుందన్నారు. గేట్స్ కరస్పాండెంట్ వీకే పద్మావతమ్మ, ప్రిన్సిపాల్ సురయ, మానవతా రక్తదాతల సంస్థ ప్రతినిధి అమరనాథ్‌రెడ్డి పాల్గొన్నారు.

మద్యం బాటిళ్ల స్వాధీనం

పుట్లూరు: కుమ్మనమల గ్రామంలో అక్రమంగా మద్యం విక్రయిస్తున్న కేశవనాయుడు అనే వ్యక్తిని పోలీసులు అరెస్ట్ చేశారు. నిందితుడి నుంచి 11 మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్‌ఐ హేమాద్రి తెలిపారు.